

జ్ఞాని పురుష్ దాదా భగవాన్ నిర్వచించిన

# జగత్తుకి కర్త ఎవరు?



Telugu

జ్ఞాని పురుష్ దాదా భగవాన్ నిర్వచించిన

# జగత్తుకి కర్త ఎవరు?

మూల గుజరాతి సంకలనం - డా.నీరు బెహన్ అమీన్

తెలుగు అనువాదం - మహాత్మగణం

**ప్రకాశకులు :** అజీత్ సి.పటేల్
దాదా భగవాన్ విజ్ఞాన్ ఫౌండేషన్
1, వరుణ్ అపార్ట్‌మెంట్, 37,శ్రీమాలి సొసైటీ
నవరంగ్‌పురా పోలీస్ స్టేషన్ ఎదురుగా,
నవరంగ్‌పురా, అహ్మదాబాద్ – 380009
గుజరాత్, భారత్
**ఫోన్:** + 91 7935002100, +91 9328661166/77

**కాపీ రైట్ :** © Dada Bhagwan Foundation,
5, Mamta Park Society, B\h. Navgujarat College,
Usmanpura, Ahmedabad -380014, Gujarat, India.
**Email :** info@dadabhagwan.org
**Tel :** +91 9328661166/77

**All Rights Reserved. No part of this publication may be shared, copied, translated or reproduced in any form (including electronic storage or audio recording) without written permission from the holder of the copyright. This publication is licensed for your personal use only.**

**మొదటి ముద్రణ** : November 2025 (500 Copies)

**భావ మూల్యం** : 'పరమ వినయం', మరియు "నాకు
ఎంతమాత్రం తెలియదు. అదే భావన

**ధర** : Rs. 50

**ముద్రిక** : అంబా మల్టి ప్రింట్
హెచ్.బి.కపాడియా న్యూ హైస్కూల్ ఎదురుగా,
ఛత్రల్–ప్రతాప్పురా రోడ్, ఛత్రల్,
తాలూకా. కలోల్, జిల్లా.
గాంధీనగర్ – 382729, గుజరాత్.
**ఫోన్:** +91 79 3500 2142

**ISBN/eISBN** : 978-81-981667-9-1

**Printed in India**

# త్రిమంత్రం



నమో అరిహంతాణం

నమో సిద్ధాణం



నమో ఆయరియాణం



నమో ఉవజ్ఝాయాణం

నమో లోయే సవ్వ సాహూణం

ఏసోపంచణమోక్కారో,

సవ్వాపావప్పణాసణో

మంగళా ణం చ సవ్వేసిం,

పడమం హవయీ మంగళం

ఓం నమో భగవతే వాసుదేవాయ

ఓం నమో శివాయ

జై సచ్చిదానంద



# దాదా భగవాన్ ఎవరు?

అది జూన్ 1958 లో ఒక సాయంత్రం సమయం సుమారు 6:00, ప్రదేశం రద్దీగా ఉన్న సూరత్ పట్టణ రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫార్మ్ నం.3.లో బెంచీ మీద కూర్చునివున్న శ్రీ అంబాలాల్ మూల్జీ భాయ్ పటేల్ అనే దేహమందిరంలో, ప్రకృతిపరంగా, అక్రమ రూపంలో, ఎన్నో జన్మలుగా వ్యక్తమయ్యేందుకు ఆత్రుతగా ఎదురుచూస్తున్న 'దాదా భగవాన్' పూర్ణ రూపంలో ప్రకటితమయ్యారు, ఆధ్యాత్మిక అద్భుతంలా. ఒక గంట సమయంలోనే ఆయనకు విశ్వ దర్శనం అయింది. "నేనెవరు? భగవంతుడు ఎవరు? విశ్వాన్నంతా ఎవరు నడిపిస్తున్నారు? కర్మ అంటే ఏమిటి? ముక్తి అంటే ఏమిటి?" ఇలాంటి ప్రపంచంలో ఆధ్యాత్మిక ప్రశ్నలన్నిటికీ సమాధానం వచ్చింది. ఈ విధంగా దైవం, విశ్వానికి సంబంధించిన ఒక అద్వితీయమైన పూర్ణ స్వరూప దర్శనం కావించింది, దాని ఫలస్వరూపమే శ్రీ అంబాలాల్ మూల్జీ భాయ్ పటేల్, గుజరాత్‌లోని చరోతర్ క్షేత్రంలోని భాదరణ్ గ్రామంలో పాటీదార్, ఒక కాంట్రాక్ట్ పని చేసే వ్యక్తి, అయినా కూడా సంపూర్ణ వీతరాగ పురుషుడు.

"వ్యాపారంలో ధర్మం పాటించాలి కాని, ధర్మాచరణలో వ్యాపారం చేయగూడదు" అనే సిద్ధాంతంతోనే ఆయన జీవితమంతా గడిపారు. ఆయన ఎప్పుడూ ఎవరి దగ్గరి నుంచీ డబ్బు తీసుకోలేదు సరికదా తన ఆదాయం నుంచే తీర్థయాత్రలు చేసే భక్తులకు ఆర్థిక సహాయం చేసారు.

ఆ విధంగా ఆయనకు కేవలం రెండు గంటలలోనే సిద్ధించిన అద్భుతమైన జ్ఞానాన్ని ఉపయోగించి, ఆయన ఎందరో ముముక్షువులకు ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించారు. దాన్ని ఆయన అక్రమ మార్గం అని అన్నారు. అక్రమ అంటే ఒక క్రమం లేని అర్థం. క్రమం అంటే ఒక మెట్టు పైన మరో మెట్టుని క్రమంగా ఎక్కుతూ వెళ్ళటం. అక్రమ మార్గమంటే షార్ట్‌కట్‌లో లిఫ్ట్ ద్వారా పైకి చేరుకోవటం.

ఆయన "దాదా భగవాన్ ఎవరు" అన్న రహస్యాన్ని స్వయంగా చెప్తూ, "మీ ముందు కనిపిస్తున్న ఈ ఆకారం దాదా భగవాన్ కాదు. ఈయన ఎ.ఎమ్.పటేల్. మేము ఒక జ్ఞానపురుషుడను, లోపల ప్రకటితమైనది దాదా భగవాన్. దాదా భగవాన్, 14 లోకాలకు నాధుడు. ఆయన మీలో కూడా ఉన్నాడు. అందరిలోనూ ఉన్నాడు. మీలో అవ్యక్త రూపంలో ఉన్నాడు, నాలో సంపూర్ణ రూపంలో వ్యక్తమై ఉన్నాడు. ఆ దాదా భగవాన్ గారికి నేను కూడా ప్రణామం చేస్తాను"

# ఆత్మజ్ఞానానికి ప్రత్యక్ష లింక్

"నేను నా చేతులతో కొందరికి సిద్ధిని ప్రసాదించబోతున్నాను. నా తర్వాత ముందుకు నడిపేవాళ్ళు ఉండాలి కదా! నా తర్వాత కూడా మనుషులకు మార్గం చూపించేవాళ్ళుండాలి కదా!"

–దాదాశ్రీ

పరమ పూజ్య దాదాశ్రీ పల్లెపల్లెకు దేశవిదేశాలలో తిరుగుతూ ముముక్షువులకు సత్సంగం, ఆత్మజ్ఞాన ప్రాప్తిని కలిగిస్తూవచ్చారు. వీరు తమ జీవితకాలంలోనే పూజ్య డా.నీరు బెహన్ అమీన్ (నీరూ మా) కి ఆత్మజ్ఞానాన్ని కలిగించి జ్ఞానసిద్ధిని ప్రసాదించారు. దాదాశ్రీ దేహాన్ని చాలించిన తర్వాత నీరూ మా, ముముక్షువులకు సత్సంగం, ఆత్మజ్ఞాన ప్రాప్తిని నిమిత్త భావనతో చేస్తూవస్తున్నారు. పూజ్య దీపక్ భాయ్ దేశాయ్‌కి దాదాశ్రీ, సత్సంగాన్ని నిర్వహించే సిద్ధిని ప్రసాదించారు. నీరు మా సమక్షంలోనే, ఆమె ఆశీర్వాదంతోనే పూజ్య దీపక్ భాయి దేశవిదేశాలలో ఎన్నో ప్రాంతాలకు వెళ్ళి, ముముక్షువులకు ఆత్మజ్ఞాన ప్రాప్తిని కలిగించి వచ్చారు. ఆ పని ఇప్పటికీ నీరూమా దేహాంతం తర్వాత కూడా కొనసాగుతూనేవుంది. ఆత్మజ్ఞాన ప్రాప్తి తర్వాత ఎందరో ముముక్షువులు ప్రపంచంలో ఉంటూ, తమ తమ బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తూ, ముక్త పురుషులుగా ఆత్మానందాన్ని అనుభవిస్తున్నారు.

ఈ గ్రంథంలో ముద్రితమైన వాణి, మోక్షార్థుల మార్గదర్శనంలో ఎంతో ఉపయోగకరం. కానీ, మోక్షప్రాప్తి కోసం ఆత్మజ్ఞానాన్ని పొందటం అవసరం. అక్రమ మార్గంలో ఆత్మజ్ఞానాన్ని పొందేందుకు ఇప్పటికీ మార్గం తెరిచేవుంది. దీపకళిక మరో దీపాన్ని వెలిగించినట్లుగానే, ప్రత్యక్షంగా ఆత్మజ్ఞాని నుంచే ఆత్మజ్ఞాన ప్రాప్తిని కలిగించుకొని తన ఆత్మను జాగృతం చేసుకోవచ్చు.

# విన్నపం

జ్ఞాని పురుషులు పూజ్య దాదాభగవాన్ శ్రీముఖం నుంచి వెలువడ్డ ఆధ్యాత్మిక, వ్యావహారిక జ్ఞానానికి సంబంధించిన వాణిని రికార్డ్ చేసి, దానిని సంకలన సంపాదకీయాలతో పుస్తక రూపంలో ప్రచురించటం జరుగుతుంది. వివిధ విషయాల మీద వెలువడిన అద్భుతమైన సారస్వత సంకలనాన్ని ఈ పుస్తకాలలో చూస్తారు. అవి కొత్తగా చేరిన పాఠకులకు కూడా ఒక వరంలా పనిచేస్తుంది.

ఈ అనువాదాలలో, స్వయంగా దాదాజీ వాణిలాగానే వినిపించే విధంగా ఉండేందుకు విశేష ప్రయత్నాలు జరిగాయి. ఈ కారణంగా కొన్ని సందర్భాలలో తెలుగు వ్యాకరణానికి భిన్నంగా ఉందనిపించవచ్చు. కానీ, దాని వెనుకనున్న లక్ష్యాన్ని పరిగణనలోకి తీసుకుంటే ప్రయోజనకరంగా ఉంటుంది.

ఈ పుస్తకంలో ఎన్నో చోట్ల నిఘంటువులలోని వాక్యాలు కాక, దాదాశ్రీ ఉపయోగించిన వ్యాక్యాలను ఎక్కువ స్పష్టత రావటం కోసం తీసుకుని రాయటం జరిగింది. అందువలన కొన్ని చోట్ల ఇంగ్లీషు పదాలనే దీనికి మూలమైన హిందీ పుస్తకంలో హిందీ పదాలలా రాయటం జరిగింది. అదే దాదాశ్రీ శ్రీముఖం నుంచి వెలువడిన గుజరాతీ మాటలనైతే యథాతథంగా ఇటాలిక్స్‌లో రాయటం జరిగింది. ఎందుకంటే, వాటికి సమానమైన, వాటి పూర్తి అర్థాన్నిచ్చే హిందీ పదాలు లేవు కనుక. కాకపోతే వాటికి దగ్గర్లో ఉన్న హిందీ పదాలను ఆ పుస్తకాలలో చివర్లో ఇచ్చారు.

ఒక జ్ఞాని వాక్యాలను హిందీలో అనువాదం చేయటానికి వారి వంతు ప్రయత్నం చేసామని చెప్తున్నారు. అదే ప్రయత్నం తెలుగులో కూడా జరిగింది. కాకపోతే దాదాశ్రీ అందించిన ఆత్మజ్ఞానాన్ని యథాతథంగా పొందాలంటే, దాన్ని గుజరాతీలో చదివితేనే ఆ పని పూర్తిగా జరుగుతుంది. జ్ఞానపు లోతులలోకి వెళ్ళాలంటే, ఆ వాక్యాలలోని మర్మాన్ని పూర్తిగా అవగతం చేసుకోవాలంటే గుజరాతీ భాషను నేర్చుకోమని మేమివ్వగల సలహా.

అనువాదంలోని లోపాలకు మమ్మల్ని క్షమించవలసిందిగా ప్రార్థన.

# సంపాదకీయం

అనాదికాలం నుంచి జగత్తు గురించిన వాస్తవాన్ని తెలుసుకునేందుకు మనిషి ప్రయత్నిస్తున్నా, సరిగ్గా తెలుసుకోలేకపోయాడు. ముఖ్యంగా, వాస్తవికతలో, నేను ఎవరు, ఈ జగత్తుని నడిపిస్తున్నది ఎవరు, ఈ జగత్తుని రచించినవారెవరు, అన్నవి తెలుసుకోవాలి. ఈ ప్రస్తుత సంకలనంలో నిజమైన ఆ కర్త ఎవరు అన్న రహస్యాన్ని వెల్లడిచేయటం జరిగింది.

సామాన్యంగా మంచి జరిగితే 'నేను చేసాను' అని నమ్ముతాడు, చెడు జరిగితే, 'ఇతనే అంతా పాడుచేసాడు' అని ఇతరులను ఆక్షేపిస్తాడు. లేదా, 'నా గ్రహదశ అంతా చెడగొట్టింది' అంటాడు, లేకుంటే 'భగవాన్ అలా చేసాడు' అని కూడా ఆక్షేపిస్తాడు. ఇదంతా రాంగ్ బిలీఫ్. భగవాన్ పక్షపాతం చూపించి నీకు నష్టం కలిగిస్తాడా?

ఈ ప్రపంచాన్ని ఎవరు తయారుచేసారు? తయారుచేసినవాడంటూ ఎవరైనా ఉంటే, అతన్ని ఎవరు సృష్టించారు? మళ్ళీ అతన్నెవరు సృష్టించారు? అంటే దానికి అంతే లేదు. ఇంకా, అతను ఈ ప్రపంచాన్ని సృష్టించాలనుకుంటే, అందరికీ దుఖం కలిగేటువంటి ఈ ప్రపంచాన్ని ఎందుకు సృష్టించినట్టు అన్న ఈ ప్రశ్న కూడా ఉదయిస్తుంది. ఎవరికీ సుఖమనేదే లేదా? అతనికేమో మజా, నాకేమో శిక్షా, ఇదేం న్యాయం?

ఈ విజ్ఞానంలో, విశ్వంలో శాశ్వత తత్త్వం ఉంటుందని నిరూపించటం జరిగింది. శాశ్వతమంటే, దానికి ఉత్పత్తి లేదు, వినాశనం లేదు– అంటే అనాది, అనంతమైనది. మనలోని ఆత్మ కూడా శాశ్వతమైనది. ఈ జగత్తుని ఎవరూ సృష్టించలేదు, దానికి నాశనం కూడా లేదు. ఈ జగత్తు ఇంతకు ముందు ఉంది, ఇక ముందు ఉంటుంది. దాన్ని సృష్టించవలసిన అవసరం ఏముంది? ఈ విశ్వం స్వయంభూ, స్వయం సంచాలకం. భగవాన్ ఇందులో ఏమీ చేయలేదు. ఆయన జ్ఞాత, ద్రష్ట, పరమానంద స్వరూపుడు.

ఈకాలంలో కర్తకి సంబంధించిన సిద్ధాంతాన్ని మొట్టమొదటిసారిగా పూజ్య దాదా భగవాన్ విశ్వానికి యదార్థ స్వరూపంలో అందించారు. అదేమిటంటే, ఈ ప్రపంచంలో స్వతంత్రంగా కర్త అనేవారెవరూ లేరు. ఈ ప్రపంచాన్ని రచించినవారు, నడిపింవారు కూడా ఎవరూ లేరు. ఈ జగత్తు నడిచేది సైంటిఫిక్ సర్‌కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్‌తో. దాన్ని పరమ పూజ్య దాదాశ్రీ 'వ్యవస్థిత శక్తి' అంటారు.

జగత్తులో స్వతంత్ర కర్త ఎవరూ లేరు, అందరూ నైమిత్తిక కర్తలే, అందరూ నిమిత్తులే. గీతలో కూడా శ్రీకృష్ణ భగవానుడు అర్జునునితో, 'హే అర్జునా! నీవీ యుద్ధంలో నిమిత్తమాత్రుడివే కాని, యుద్ధానికి కర్తవి కావు' అంటారు.

పరమ పూజ్య దాదాశ్రీ అనేకమైన దృష్టాంతాలతో నైమిత్తిక కర్త సిద్ధాంతాన్ని వివరించారు. ఒక కప్పు టీ తయారవాలంటే, ఒకరు నేను టీ పెట్టాను అంటారు. కానీ వాస్తవానికి నీరు, పంచదార, టీ పౌడర్, పాలు, గిన్నె, స్టవ్, అగ్గిపెట్టె, కప్, ఎన్ని వస్తువులు కావాలి ఒక కప్పు టీ కావాలంటే? మరి టీ ఎవరు పెట్టినట్లు? ఓన్లీ సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్ (వైజ్ఞానికి సంయోగ ప్రమాణం) తో జరిగింది. అజ్ఞానం, భ్రాంతితో అహంకారం, 'నేను చేసాను' అంటుంది. కానీ ఏ కార్యమైనా అన్ని సంయోగాల కారణంగానే జరుగుతుంది.

ప్రస్తుత ఈ పుస్తికలో కర్త రహస్యం, పరమ పూజ్య దాదాశ్రీ సాదా, సరళమైన భాషలో హృదయంలోకి చొచ్చుకుని పోయేటట్లుగా వివరించబడింది.

జై సచ్చిదానంద

**–డా.నీరు బెహన్ అమీన్**

# జగత్తుకి కర్త ఎవరు?

## పజిల్‌సమ్ వాస్తవికత

**దాదాశ్రీ:** ఈ జగత్తులో క్రియేటర్ (సృష్టికర్త) ను ఎప్పుడైనా చూసారా?

**ప్రశ్నకర్త:** ఫొటోలో చూసాము.

**దాదాశ్రీ:** ఈ జగత్తులో క్రియేటర్ నా? క్రియేటర్ ఫొటో ఉండదు. ఫొటో అయితే ఇక్కడి మనిషి ఒకతన్ని అందరూ, 'ఇతను భగవాన్ అయ్యాడు' అంటే, అతని ఫొటో అయ్యుండొచ్చు. క్రియేటర్ అంటే పెద్ద మాట.

**ప్రశ్నకర్త:** అంటే, ఇదంతా మిథ్య అని మేము అర్థం చేసుకోవాలా?

**దాదాశ్రీ:** మిథ్య అయితే కాదు. మిథ్య అని దేన్ని అంటారు, అక్కడ నీరు ఉండదు కాని ఉన్నట్లుగా కనిపిస్తుంది అలాంటిదాన్ని. అలా ఈ జగత్తు మిథ్య కాదు. జగత్తు కరెక్ట్ (నిజం) ఆత్మ కూడ కరెక్ట్. ద వర్ల్డ్ ఈజ్ కరెక్ట్ బై రిలేటివ్ వ్యూ పాయింట్ అండ్ ఆత్మ ఈజ్ కరెక్ట్ బై రియల్ వ్యూపాయింట్. మీకు అర్థమైందా?

**ప్రశ్నకర్త:** రియల్, రిలేటివ్‌లలో భేదం ఏమిటి?

**దాదాశ్రీ:** రియల్ అయినదానికి ఎటువంటి ఆధారమూ అవసరం

లేదు. అది స్వయం ఆధారంగానే ఉంటుంది. ఇతరములమీద ఆధారపడి ఉండగలిగేవి అన్నీ రిలేటివ్. రిలెటివ్ అన్నీ ఒకదాని మీద మరొకటి ఆధారపడివుంటాయి. ఆల్‌దీజ్ రిలెటివ్స్ ఆర్ టెంపరరీ అడ్జస్ట్‌మెంట్స్ అండ్ రియల్ ఈజ్ పర్మనెంట్.

**ప్రశ్నకర్త:** ఆత్మ ఉన్నంతవరకు, మనిషి బ్రతికివున్నాడని అర్థమౌతుంది. కానీ మనుషులకు అంతం లేదు కదా, ఆఖరివరకు?

**దాదాశ్రీ:** మనిషికి ఎండ్ లేదా? అయితే ఈ గాడిదలు, కుక్కలకు అన్నిటికి ఎండ్ ఉందా?

**ప్రశ్నకర్త:** దేనికీ అంతం లేదు.

**దాదాశ్రీ:** అయితే, ఈ పజిల్‌పజిల్‌లాగానే ఉండిపోతుందా? పజిల్ సాల్వ్ కానే కాదా? దేనికైనా అంతం లేదంటే ఆ పజిల్ సాల్వ్ కాలేదు. మీకు పజిల్ ఎప్పుడూ ఎదురవలేదా?

**ప్రశ్నకర్త:** ఔను, అవుతుంటుంది.

**దాదాశ్రీ:** అయితే ఈ పజిల్‌కి అంతమనేది ఎప్పటికీ రాదా? చూడు, విషయమేమిటంటే, పజిల్ అనే పదం ఎలాంటిదంటే అది స్వయంగా సమాధానాన్ని వెంటతెచ్చుకునే వచ్చింది. లేకపోతే పజిల్ అనే పదమే ఉండదు. ముందు సొల్యూషన్ (సమాధానం) ఉంటుంది. అప్పుడే పజిల్ అనే పేరు దానికి పడుతుంది. ఇందులో మీకు అర్థం కానిదంటూ ఏమీ లేదు. అలాంటిదేమైనా ఉందా? మీకు అర్తం చేసుకునే ఉద్దేశ్యం ఉండికూడా అర్థం కాకపోతే, అలాంటివి 'జ్ఞానిపురుష్' ని అడిగి తెలుసుకోండి. 'జ్ఞానిపురుష్' కి అన్నీ తెలుసు. జగత్తులోని అన్ని విషయాలు వాళ్ళకి తెలుసు.

**ప్రశ్నకర్త:** ఈ జగత్తుని ఎవరు సృష్టించారు? సాకారమా, నిరాకారమా?

**దాదాశ్రీ:** చూడు, ఈ జగత్తుని తయారుచేసినవారు సాకారులూ కాదు, నిరాకారులూ కాదు. 'ద వర్ల్డ్ ఈజ్ ద పజిల్ ఇట్‌సెల్ఫ్'.

**ప్రశ్నకర్త:** అయితే, ఈశ్వరుడే అంతా చేయిస్తున్నాడా?

**దాదాశ్రీ:** ఈశ్వరుడు చేయించడు. ఈశ్వరుడు ఇందులో చెయ్యిపెట్టడు. ఈశ్వరుడు ఇందులో చెయిపెడితే బాధ్యతంతా ఆయనదౌతుంది. అప్పుడు మన బాధ్యతనేది ఏమీ ఉండదు. మనం తప్పించుకుంటాం. పనిచేసే ఆ రెండవ శక్తి ఏమిటో నేను చెప్తాను. భగవాన్ అయితే భగవానుడే. భగవాన్ ప్రపంచం విషయంలో ఎప్పుడూ చెయిపెట్టలేదు. ఆయన, ఈ ప్రపంచం ఎలా నడుస్తోంది అన్నదంతా చూస్తుంటారు, స్వయంగా పరమానంద స్థితిలో ఉంటారు.

లౌకికమైన భాషలో, అంతా భగవంతుడే చేసాడు అని అంటారు, మరో పక్క మోక్షం కూడా ఉందని అంటారు. అంటే మోక్షానికి కూడా పోగలుగుతారు. అరె, ఈ మోక్షం, భగవంతుడే అంతా సృష్టించాడు అన్నవి రెండూ పరస్పర విరుద్ధమైన మాటలు. మోక్షమనేది ఉంటే భగవంతునితో పనిలేదు, భగవంతుడే సృష్టించివుంటే మోక్షంతో పనిలేదు. మోక్షం, భగవాన్ రెండూ కలిసి ఉండలేవు. ఒకవేళ భగవాన్ అంతా సృష్టించివుంటే ఆయన మన పైవాడు (పూజ్య, బాస్) అవుతారు. కానీ అలా లేదు. మనకి అండర్‌హాండ్ (కింద పనిచేసేవాడు) ఎవరూ లేరు, మన పైన కూడా ఎవరూ లేరు. మరి ఈ ప్రపంచాన్ని ఎవరు సృష్టించారు? రచించేవాడు లేకుండా అవదు కదా?

**ప్రశ్నకర్త:** మన హిందూస్థానీ ప్రజలు ఆయనను భగవాన్ అంటారు, వైజ్ఞానికులు (సైంటిస్ట్‌లు) అంతా దాన్ని ప్రకృతి అంటారు. కానీ దీన్నంతటినీ నడిపించేదుకు ఒక శక్తి అయితే ఉండాలి కదా?

**దాదాశ్రీ:** కంట్రోల్ అయితే ఎవరూ చేయరు. అది కేవలం కంప్యూటర్. ఆ కంప్యూటరే జగత్తునంతా నడిపిస్తుంది.

**ప్రశ్నకర్త:** ఆ కంప్యూటర్‌ని ఎవరు నడిపిస్తారు?

**దాదాశ్రీ:** దాన్ని నడిపించవలసిన అవసరమే లేదు. దానంతటదే నడుస్తుంది. మనందరి మెదళ్లు చిన్నపాటి కంప్యూటర్లే. జగత్తుని నడిపించేది పెద్ద కంప్యూటర్. చిన్న కంప్యూటర్ల లోంచి లెక్కలన్నీ పెద్ద కంప్యూటర్‌లోకి వెళ్ళి చేరుతాయి.

ఇప్పుడు మీరు నేను ఇది చేసాను అంటారే, మరి మిమ్మల్ని ఎవరు నడిపిస్తున్నారు?

**ప్రశ్నకర్త:** అది, భగవాన్ నడిపిస్తారు.

**దాదాశ్రీ:** భగవాన్ చేస్తున్నట్లయితే మరి మీరెందుకు చేస్తున్నారు? భగవాన్ చేస్తున్నట్లయితే మీరు కర్తృత్వ భావనను వదిలేయండి. మీరే చేస్తున్నట్లయితే అందులో భగవంతుని పేరెత్తకండి. నేను కర్తను కాను, జీవులంతా కర్తలు అని భగవాన్ అన్నారు. ఆవులు, గేదెలు అన్నీ తమ పనులు తాము చేస్తాయి. ఎందుకంటే వాటికి బుద్ధి ఇవ్వబడింది కనుక. అది మెదడుతో నడుస్తుంది. జీవులన్నిటికీ బుద్ధి అనేది ఇవ్వబడింది. వీటి బుద్ధి ఎలా నడిపిస్తే అలా నడుస్తాయంతే! భగవంతుడు ఇందులో చెయిపెట్టడు. భగవాన్ మీకు ప్రకాశాన్నిస్తాడు. వేరే ఏమీ లేదు. మిగతా తలబద్దలు కొట్టుకునే పని నీది. అందరికీ బుద్ధి అనేది ఉంది. ఆవు, మేక, గేదె అన్నిటికీ బుద్ధి అనేది ఇవ్వటం జరిగింది. అవి కిందికి దిగుతాయి, పైకి ఎక్కుతాయి, అదంతా బుద్ధితో జరుగుతుంది. భగవంతుడేమీ నడపడు.

సైంటిస్ట్‌లంతా గాడ్ ఈజ్ నాట్ క్రియేటర్ ఆఫ్ దిస్ వర్ల్డ్ (భగవాన్ ఈ జగత్తు రచయిత కాదు) అంటారు. నాకూ అలాగే అనిపిస్తుంది. ఎందుకంటే అలా అనగల రిసెర్చ్ జరిగింది. అందువలన నేను, 'మీరు ఏమైనా చెయ్యగలిగితే అది ఎంతవరకు? దానికో లిమిట్ ఉంది. ఏమిటది? మీరు మీ బుద్ధిని ఉపయోగించ గలిగేంత వరకు.' బుద్ధిని దాటి ఎవరూ ముందుకు పోలేరు. బుద్ధితోనే నడుస్తారు కాని ఇందులో భగవంతుడి చెయ్యి లేదు. చూడండి, లోకంలో మనుషులంతా భగవంతుడే అంతా తయారుచేసాడు అని అంటారు. మనుషులంతా పిల్లలతో సహా ఇదే అంటారు కానీ, అది నిజం కాదు. వాస్తవం కాదు. అది లౌకికమైన మాట. లౌకికం సామాన్యుల కోసమే ఉంది. సత్యమేమిటన్నది తెలుసుకోవాలి. అదేమిటో కనిపెట్టాలి కదా?

మీకు వాస్తవం వద్దు కాని, వ్యూపాయింట్ (దృష్టికోణం) తెలుసుకోవాలంటే, అది కూడా మీకు చెప్తాను, భగవానే అంతా సృజించాడు, భగవానే దీన్ని నడిపిస్తున్నాడు

అని. అంతేకాక మీకు ఇంకా ఏం చెయ్యాలో చెప్తాను. ఒకవేళ మీ పని ఏమైనా చెడిపోతే, భగవాన్ అలా అవాలని కోరుకున్నాడు అని చెప్పండి. నష్టం జరిగినా భగవదేచ్ఛ అనుకోండి, లాభం వచ్చినా భగవదేచ్ఛ అనుకోండి. పిల్లలు పుట్టినా భగవదేచ్ఛ, పిల్లవాడు చనిపోయినా భగవదేచ్ఛ. అలా అన్నిటికీ అనుకున్నట్లయితే మీ లైఫ్ బాగా నడుస్తుంది. దీన్ని రిలేటివ్ మాట అంటారు. ఆ రియల్, వాస్తవికత అర్థం కాదు కనుక ఇలా చెప్పవలసివస్తుంది. జరిగేది ఏమైనా అది భగవదేచ్ఛ అని అనుకుంటే చాలు అది ఎక్కువే.

## క్రియేషన్‌కి కర్త ఎవరు?

ఆధ్యాత్మికమైన ప్రశ్నలు ఏమైనా మీరు అడగవచ్చు. వాటన్నిటి సొల్యూషన్ మీకు లభిస్తుంది. మీకు పజిల్‌లా అనిపించదా? ప్రతిరోజు రోజంతా మనుషులకు అంతా పజిల్‌లాగానే కనిపిస్తుంది. ఈ పజిల్‌లోనే మనుషులంతా డిజాల్వ్ అయ్యారు (చిక్కుకునిపోయారు). మీరు ఏమైనా అడగదలచుకుంటే అడగండి, మీకు సొల్యూషన్ అంతా ఇస్తాను. ఈ వర్ల్డ్ ఇట్‌సెల్ఫ్ పజిల్ అయిపోయింది (జగత్తంతా ఒక చిక్కు ప్రశ్నగా మారింది. నేను ఈ పజిల్ సొల్యూషన్‌ని కనిపెట్టాను. మిమ్మల్ని కూడా సాల్వ్ చేసుకునేటట్లు చేస్తాను.

గాడ్ ఈజ్ ఇన్ ఎవిరీ క్రీచర్ వెదర్ విజిబుల్ ఆర్ నాన్‌విజిబుల్, నాట్ ఇన్ క్రియేషన్. భగవాన్ క్రీచర్‌లో ఉన్నాడు కానీ క్రియేషన్‌లో కాదు.

**ప్రశ్నకర్త:** క్రియేషన్ ఎక్కడి నుండి వచ్చింది?

**దాదాశ్రీ:** క్రియేషన్ ఉత్పన్నమైంది మనిషి ఇగోయిజమ్ లోంచి. అంతా అహంకారం లోనుంచే ఉత్పన్నమైంది. తయారుచేసేవారెవరూ లేరు. జగత్తులో ఆరు సనాతన తత్త్వాలున్నాయి. వాటి విశేష పరిణామం కారణంగానే జగత్తు తయారై ఎదుట నిలిచింది.

**ప్రశ్నకర్త:** అయితే మనం క్రియేషన్ గురించి తిరిగి ఆలోచిద్దాం. ఇంతకీ ఈ క్రియేషన్ ఎక్కడి నుండి వచ్చింది? ఏ తత్త్వాల నుంచి దీని క్రియేషన్ జరిగింది?

**దాదాశ్రీ:** ఈ విషయంలో నేను ఒకే మాట చెప్తాను. ఓన్లీ సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్‌తోనే ఈ జగత్తంతా తయారై నిలిచింది. సైంటిఫిక్ అంటే గుహ్యమైనది. గుహ్యమైన ఎవిడెన్స్, గుహ్యమైన సంయోగాలతో, నాకు కూడా అర్థం కూడా కాని సంయోగాలతో ఇదంతా జరిగింది. మీరు ఈ రోజు ఇలా నన్ను కలిసారంటే, మీకు ఏమనిపిస్తుంది? నేను అక్కడికి పోయాను, అక్కడ నాకు 'జ్ఞానిపురుష్' కలిసారు అని ఈ రెండు మాటలే చెప్తారు. కానీ దాని వెనుక హండ్రెడ్ విషయాలు (ఎన్నో సంయోగాలు) ఉన్నాయి. మీరు, 'నేను వెళ్ళాను' అని అహంకారం చూపిస్తారు.

**ప్రశ్నకర్త:** అహంకారం వద్దనుకుంటే, భగవదేచ్ఛ అని అనుకోవాలా?

**దాదాశ్రీ:** కాదు అది భగవాన్ కోరిక కాదు. అది భగవాన్ కోరుకున్నదైతే, భగవాన్‌ని బికారి అనాల్సివస్తుంది. భగవాన్ భగవానే, వీతరాగి. ఆయనకు కోరికనేదే ఉండదు. భగవాన్ దగ్గర లేనిదంటూ ఏమీ లేదు.

## జగత్తుని నడిపించాలనే ఇచ్ఛ ఎవరిది?

**ప్రశ్నకర్త:** భగవాన్ ఇచ్ఛ లేకుండా ఒక ఆకు కూడా కదలదు అన్న భావన ఒకటి ఉంది.

**దాదాశ్రీ:** అయితే దొంగ దొంగతనం చేస్తాడంటే, అది కూడా భగవాన్ కోరిక మీదనే జరుగుతుందా? భగవంతునితో ప్రమేయం లేకుండా ఇవన్నీ కదులుతూనే వుంటాయి కదా. ఆకేమిటి, ఈ చెట్లు కూడా కదులుతాయి. అరె, భూకంపం కూడా జరుగుతుంది. ఇవన్నీ భగవాన్ ఇష్ట ప్రకారం జరుగుతున్నాయా?

**ప్రశ్నకర్త:** జరిగిన మంచి అంతా భగవాన్ కోరిక ప్రకారం జరిగింది. చెడు జరిగితే అందులో భగవాన్ ఇచ్ఛ ఉండదు.

**దాదాశ్రీ:** ఎవరికి ఆ చెడు?

**ప్రశ్నకర్త:** నా మనసులో అటువంటి శంక కలుగుతుంది కనుకనే అలా అనుకోవలసివస్తుంది.

**దాదాశ్రీ:** చూడు, భగవాన్ ఎక్కడ ఉంటారన్నది నీకు తెలియదు. భగవాన్ ఏం చేస్తారు అన్నది తెలియదు కానీ, భగవంతుడు కోరకపోతే ఒక ఆకు కూడా కదలదు అని అంటారు. ఈ ఆకులన్నీ కదులుతున్నాయి కదా అవన్నీ భగవాన్ ఇచ్ఛకు వ్యతిరేకంగా కదులుతున్నాయా? భగవాన్‌కి అటువంటి కోరికలేమీ ఉండవు. ఇచ్ఛలు కలిగివున్నవాడిని భగవాన్ అనరు. భగవాన్ ఇచ్ఛలు లేనివాడు. మేము 'జ్ఞానిపురుషులం' కూడా ఇచ్ఛారహితులమే అయినప్పుడు భగవాన్ ఎంత ఇచ్ఛారహితులైవుండాలి? భగవాన్ ఇచ్ఛ లేకుండా ఆకు కూడా కదలదు అన్నది మీకు సత్యం, ప్రపంచానికి కూడా సత్యం. కానీ దాన్ని దాటి ముందుకెళ్ళి చూస్తే, అక్కడ ఈ మాటలన్నీ తప్పని నిరూపితమౌతాయి. సత్యం వేరొకటుంది. ఆ సత్యం పుస్తకాలలో ఇమడదు. అది అవర్ణనీయం, అవ్యక్తమైనది. వీళ్ళంతా ఎలా మాట్లాడుతారు? సంపాదన వస్తే నేను డబ్బు సంపాదించానని, నష్టం వస్తే భగవంతుడే చేసాడని అంటారు. నష్టం కలిగితే, 'నేను నష్టం కలిగించుకున్నాను' అని అనరు. 'భగవంతుడలా చేసాడు. నా భాగస్వామి మంచివాడు కాదు' అంటారు. లేదంటే, 'నా గ్రహాలు అనుకూలంగా లేవు. మా అబ్బాయి పెళ్ళి చేసాం, కోడలు వచ్చింది. ఆమె కాలు మంచిది కాదు కనుక అప్పటి నుంచి మాకు బాధలే బాధలు' అంటారు.

ఎన్నెన్ని ఆక్షేపణలు చేస్తారు! మరోసారి మనిషి జన్మే లభించనంతగా ఆక్షేపణలు చేస్తారు. అలా చెయ్యకూడదు. ఎవరి మీద ఆక్షేపణలు చెయ్యకూడదు. ఎవరినీ దుఃఖపెట్టగూడదు. పుణ్యం పండినపుడు మీరేం చేసినా అంతా మంచే అవుతుంటుంది. కానీ పాపం పండినపుడు మంచి చేసినా చెడిపోతుంటుంది.

భగవాన్ అలాంటి ప్రేరేపణను కలిగించడు. అలా భగవానే ప్రేరేపిస్తే, దొంగ కూడా భగవాన్ నాకు ప్రేరణ కలిగించాడని అంటాడు. భగవంతుడే దొంగతనానికి ప్రేరేపిస్తే, ఆయన భగవాన్ అనే అనిపించుకోడు. దొంగతనం చెయ్యమని ప్రేరేపించి, దానం చెయ్యమని ప్రేరేపించినవాడిని మనం భగవాన్ అనగలమా? కానీ, లోకులు భగవంతుడే ప్రేరణ కలిగిస్తున్నాడని అంటారు.

లోకంలో మనుషులు భగవాన్‌ని వివిధ రకాలుగా అన్నారు. కొందరైతే, కర్మ ఫలాన్నిచ్చేవాడని అన్నారు. కర్మ చేసేది నేనైతే ఫలితాన్ని భగవంతుడిస్తాడా? లేకపోతే మంచి జరిగినా భగవంతుడు ఇచ్చాడు, చెడు జరిగినా భగవంతుడిచ్చాడు అనండి.

**ప్రశ్నకర్త:** కానీ నేనేమంటానంటే, మంచి చేసేది భగవంతుడు, చెడు చేసేది సైతాన్ అంటాను.

**దాదాశ్రీ:** సైతాన్ అనేది ప్రపంచంలో అసలు లేనేలేదు. బుద్ధి రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి సద్బుద్ధి, రెండవది దుర్బుద్ధి. దుర్బుద్ధిని సైతాన్ అంటారు, సద్బుద్ధిని భగవాన్ అంటారు.

**ప్రశ్నకర్త:** ఔను నిజమే.

**దాదాశ్రీ:** ఔను. భగవాన్ ఏమీ చెయ్యడు. భగవాన్ వీతరాగి. భగవాన్ ఇందులో చెయిపెట్టడు. కేవలం ఆయన సమక్షంలో అంతా నడుస్తోంది. ఆయన లేకపోతే నడవదు. ఈ శరీరంలో ఆయన ఉన్నారు కనుకనే అంతా నడుస్తూవుంది. ఆయన ఏమీ చెయ్యరు. ఆయన లైట్‌ని (ప్రకాశాన్ని) ఇస్తారు. దొంగతనం చేసేవారికీ ప్రకాశానిస్తారు, దానం చేసేవాడికీ ప్రకాశానిస్తారు. భగవాన్ వేరే ఏమీ చెయ్యరు.

## భగవాన్ ఇచ్ఛాశక్తిని కలిగినవాడా?

నాకైతే ఏమీ అవసరం లేదు. నేను ఏ వస్తువునీ కోరుకోలేదు. కానీ నా దగ్గరకు అన్నీ వాటంతటవే వచ్చేస్తాయి.

**ప్రశ్నకర్త:** అది కూడా చేసిచూసాము. ఏ వస్తువునీ కోరుకోకుండా ఉంటే అదే దానంతటది వస్తుందని చూసాము. అయినా రాలేదు.

**దాదాశ్రీ:** ఆ. అది ఎందుకంటే క్రెడిట్ సైడ్ (పుణ్యం ఖాతా) లో కొంతైనా ఉండాలి కదా? నేను ఏమీ కోరుకోకపోయినా అన్నీ వచ్చేస్తాయంటే, నా క్రెడిట్ సైడ్ (పుణ్యం) ఎంత పెద్దది!

కావాలని కోరుకునేవారిని శాస్త్రం ఏమంటుంది? బిచ్చగాడు అంటుంది. ఎందరు మనుషులు డబ్బుల బిచ్చగాళ్ళు, ఎందరు స్త్రీ విషయంలో బిచ్చగాళ్ళు, ఎందరు గౌరవ ప్రతిష్టల బిచ్చగాళ్ళు, ఎందరు కీర్తి బిచ్చగాళ్ళు, కొందరు గుడి కట్టించాలనుకునే బిచ్చగాళ్ళు. అంతా భిక్షం, భిక్షం, భిక్షంగానే ఉంది.

నాకు భిక్షం కోరేది ఏదీ లేదు కనుక, ప్రపంచం కళ్ళెం నా చేతుల్లో ఉంది. ఎవరికైతే ఏ విధమైన ఇచ్ఛా ఉండదో, వాళ్ళకి ఆ పదవి లభిస్తుంది. నాకు లభించిన పదవి ఏదైతే ఉందో, అది మీకు కూడా లభిస్తుంది. కానీ బిచ్చమడుక్కునేవాళ్ళకి కాదు.

**ప్రశ్నకర్త:** మేము బిచ్చం అడుకున్నా దొరకదు మాకు.

**దాదాశ్రీ:** ఔను. అందుకోసం కావలసిన క్రెడిట్ సైడ్ లేదు మీకు. ముందు క్రెడిట్ సైడ్ ఉండాలి. క్రెడిట్ సైడ్ ఎంత ఉంటే అంత మీకు కష్టాలు లేకుండా ఉంటాయి. భగవాన్‌కి ఇచ్ఛ అనేదేమీ ఉండదు. భగవాన్ భగవానే.

**ప్రశ్నకర్త:** అయితే ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తి అవి ఉన్నది ఎవరికి?

**దాదాశ్రీ:** అవన్నీ భగవాన్‌కి ఉన్నవి కావు. ఈ శక్తులేమీ భగవాన్‌కి లేవు. భగవాన్‌కి ఇచ్ఛాశక్తి లేదు, క్రియాశక్తి లేదు, జ్ఞానశక్తి లేదు. ఈ మూడు శక్తులూ భగవాన్‌కి లేవు. భగవాన్ కేవలం విజ్ఞానశక్తి మాత్రమే అంతే!

## అంతం ప్రపంచానికా లేక వ్యవహారానికా?

**ప్రశ్నకర్త:** ఈ ప్రపంచం ఎలా పుట్టింది? అన్నిటికంటే ముందు ఏది పుట్టింది?

**దాదాశ్రీ:** ముందు అనేదేమీలేదు. అనాది కాలం నుంచి ఇలాగే నడుస్తోంది. ముందు అనేది ఏమీ లేనేలేదు. ముందు అనేది ఉంటే దానికి అంతం కూడా ఉంటుంది. ప్రపంచానికి ఆది (ముందు) లేదు, అంతం లేదు.

**ప్రశ్నకర్త:** ఇది ఎలా అంటే, ఏదైతే పుట్టిందో దానికి బీజం ప్రపంచంలో ముందు నుంచి ఉండాలి కదా?

**దాదాశ్రీ:** ఈ మాట బుద్ధి నుంచి జనించిందే కాని జ్ఞానం నుంచి జనించింది కాదు. భగవంతుని జ్ఞానంలో ముందు అనేదేమీ లేదు.

**ప్రశ్నకర్త:** కానీ భగవంతుడు మట్టి, నీరు, అగ్ని, వాయువు ఈ నాలుగిటిని కలిపి మనిషిని తయారుచేసాడు కదా?

**దాదాశ్రీ:** లేదు. భగవంతుడు అలా చేసినట్లయితే ఆయన శ్రామికుడు అవుతాడు. అలా చేస్తే శ్రామికునికి ఆయనకు ఏమిటి తేడా? బుద్ధిలేనివాడు కూడా కాయకష్టం చేయడు.

**ప్రశ్నకర్త:** మరి ఈ ప్రపంచం ఏమిటి?

**దాదాశ్రీ:** మీరు ప్రపంచమని దేన్ని అంటారు? కంటికి కనిపించేది, అంటే, చెవులకు వినిపించేది, ముక్కు, నాలుక, స్పర్శలచే అలా ఐదు ఇంద్రియాలతో మీకు ఏదైతే అనుభవంలోకి వస్తుందో, దాన్నే మీరు ప్రపంచం అంటారా? అదంతా రిలెటివ్. ఆల్ దీజ్ రిలేటివ్స్ ఆర్ టెంపరరీ అడ్జస్ట్‌మెంట్స్ మాత్రమే.

**ప్రశ్నకర్త:** ఈ ప్రపంచానికి అంతం ఉందా?

**దాదాశ్రీ:** లేదు. ఈ ప్రపంచానికి అంతమనేది ఎప్పటికీ రాదు. కానీ మీరు సమమార్గంలో నడిస్తే దానికి అంతం ఉంటుంది. ఎన్ని మైళ్ళు మీరు నడిస్తే, అన్ని మైళ్ళు తగ్గుతుంటుంది, దానికి అంతం కూడా ఉంటుంది.

**ప్రశ్నకర్త:** అంతంలో ఏముంటుంది?

**దాదాశ్రీ:** అంతంలో మీరు అవినాశి అవగలుగుతారు. ప్రస్తుతం మీరు టెంపరరీ (వినాశి). ఎందుకంటే, 'నేను రవీంద్రను, నేను డాక్టర్‌ని' అనే రాంగ్ బిలీఫ్ (అపోహ) అందరికీ ఉంది.

**ప్రశ్నకర్త:** మృత్యువు తర్వాత ఎక్కడికి పోతాము?

**దాదాశ్రీ:** ఇప్పుడిక్కడ పదకొండో మైలులో ఉన్నవారు పన్నెండు మైలులోకి వెళ్తారు. ఇక్కడ పదవ మైలులో ఉన్నవాళ్ళు పదకొండవ మైలులోకి వెళ్తారు.

వేరే ఏదో చోటికి పోరు. అదే దారి. మార్గంలో ఎంత దాటితే అంత ముందుకు వెళ్తారు. అలా ముందుకే నడుస్తారు. ఈ మార్గం పూర్తయితే వాళ్ళు స్వతంత్రులౌతారు. స్వతంత్రత లేనంతవరకు, పరతంత్రమే ఉంటుంది.

మీ బాస్ (యజమాని) ఉన్నారా? బాస్ ఉన్నంతవరకు జీవితంలో ఎన్ని కష్టాలుంటాయి, ఎంత పరుల వశంలో ఉంటారు?

**ప్రశ్నకర్త:** నచ్చటం లేదు.

**దాదాశ్రీ:** ఔను, ఇండిపెండెంట్ లైఫ్ (స్వతంత్ర జీవనం) కావాలి. ఈ జగత్తుని ఎవరూ తయారుచేయలేదు. ద వర్ల్డ్ ఈజ్ పజిల్ ఇట్‌సెల్ఫ్. గాడ్ హాజ్ నాట్ పజిల్డ్ దిస్ వర్ల్డ్ ఎటాల్. స్వయంగా తనంతటతాను పజిల్ అయికూర్చుంది. మీకు పజిల్ అనిపిస్తుందా లేదా? ఎవరైనా, 'రవీంద్ర మంచివాడు కాడు' అంటే, అది వింటూనే మీకు పజిల్ అయిపోతుంది.

**ప్రశ్నకర్త:** ఔతుంది.

**దాదాశ్రీ:** పజిల్ ఎందుకౌతుంది? ఎందుకంటే ఈ ప్రపంచమే పజిల్ (చిక్కు ప్రశ్న) కనుక.

## దుర్ఘటన అంటే ఏమిటి?

**ప్రశ్నకర్త:** భగవంతుడిని నమ్మినట్లయితే దుర్ఘటనలనేవే ఉండవు.

**దాదాశ్రీ:** ఔను. కానీ, దుర్ఘటనలు జరుగుతాయా?

ఈ ప్రపంచంలో దుర్ఘటనలనేవే ఉండవు. దుర్ఘటన జరిగిందని అనుకోకపోతే, ఆ మనిషిని అల్పునిగా చూస్తారు. అయితే పెద్దవాడు, అన్నీ తెలిసిన మనిషి, 'అరె దుర్ఘటన జరిగింది' అనడు. సరిగ్గా తెలియనివాడే దాన్ని దుర్ఘటన అంటాడు కానీ, పూర్తిగా తెలిసినవాడు దాన్ని దుర్ఘటన అని ఎన్నటికీ అనడు. దుర్ఘటన అనేదే ఉండదు ఎప్పుడూ. మీకేమని అనిపిస్తుంది, దుర్ఘటన ఎప్పుడైనా ఉంటుందా?

దుర్ఘటన అని దేన్ని అంటారు? ఎన్ ఇన్సిడెంట్ హాజ్ సో మెనీ కాజెస్ అండ్ ఎన్ యాక్సిడెంట్ హాజ్ టూమెనీ కాజెస్. కనుక దుర్ఘటన (సామాన్యంగా) జరగనే జరగదు. దుర్ఘటన అనేదానికి కాజెస్ చాల ఎక్కువగా ఉంటాయి, 'ఇన్సిడెంట్' కి కాజెస్ తక్కువగా ఉంటాయి. రోజంతా ఇన్సిడెంట్లే జరుగుతుంటాయి. ఎప్పుడైనా ఎక్కువ కాజెస్ ఉంటాయి, దాన్ని యాక్సిడెంట్ అంటారు.

బొంబాయిలో హైవేని క్రాస్ చేసే సమయంలో, ఎవరి ముందుకైనా మోటారు బండి వచ్చినట్లయితే ఆ బండి డ్రైవర్ ఏమంటాడు? నేనెంతో కష్టపడి ఇతన్ని రక్షించాడు అని. కానీ ఆ మనిషి అంటాడు కదా, నేనే పక్కకు దూకి కాపాడుకున్నాను అని. ఈ రెండు మాటలూ తప్పే. మరికొద్ది దూరం పోయిన తర్వాత ఆ డ్రైవర్ ఒక మనిషి కాలు విరగ్గొడతాడు. అలా రక్షించేవాడు ఎలా వచ్చాడు?

(సాధారణంగా) యాక్సిడెంట్ ఎప్పుడూ జరగదు. ఈ మనుషులకు అర్థం కాదు కనుక అంటూవుంటారు, యాక్సిడెంట్ జరిగింది అని. రోజంతా ఇన్సిడెంట్లే (ఘటనలు) జరుగుతుంటాయి.

## ఈ ప్రపంచం యోజనాబద్ధమైనదా లేక యాక్సిడెంటా?

మనిషి ఎంత అహంకరించినా కానీ, నేచర్ (ప్రకృతి) ప్లానింగ్ (యోజన) ని మార్చగలిగేవాడు ఎవరూ లేరు. ప్లానింగ్‌ని మార్చగలిగేవాడంటూ ఉంటే, ప్రపంచంలో ఒక్క లేడీ (స్త్రీ) కూడా ఉండదు. స్త్రీలంతా పురుషులైపోయేవారు. కానీ ఎవరి చేతిలో ఏమీ లేదు.

నేచర్ ప్లానింగ్ ఏదైతే ఉందో, ఆ ప్లానింగ్ ప్రకారమే అంతా జరుగుతుంది. నేచర్ ప్లానింగ్ ఏమిటి? భారతదేశంలో ఇంతమంది స్త్రీలు ఉండాలి, ఇంతమంది పురుషులు ఉండాలి, ఇంతమంది క్షవరం చేసేవారుండాలి, ఇంతమంది వడ్రంగులుండాలి, ఇంతమంది కంసాలులు ఉండాలి అని. ప్రతి విషయంలోను అటువంటి ప్రమాణాలు ప్లానింగ్‌లో ఉన్నాయి. దాన్నెవరూ మార్చలేరు.

**ప్రశ్నకర్త:** దాన్ని ఎవరు డిసైడ్ (నిర్ణయం) చేస్తారు?

**దాదాశ్రీ:** ఓన్లీ సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్ (కేవలం వైజ్ఞానిక సంయోగ ప్రమాణం). భారతదేశంలో ఇంతమంది సైనికుల అవసరం ఉంది, ఇంతమంది పోలీసులు కావాలి అని లేకపోతే ఎవరూ పోలీసు ఉద్యోగం చెయ్యరు. గృహ నిర్మాణాలు చేసేవారు ఇంతమంది కావాలి, ఇంతమంది వకీళ్ళు కావాలి, ఇందరు డాక్టర్లు కావాలి. డాక్టర్ ఆదాయం బాగుంటుంది కనుక అందరూ డాక్టర్లే అయిపోతారు. కానీ అందరూ డాక్టర్లు అవలేరు. ప్రకృతి ప్లానింగ్‌లో లేనిదాన్ని ఎవరూ చేయలేరు. ప్రకృతి ప్లానింగ్‌లో మార్పులు ఎవ్వరూ చేయలేరు. స్వయం భగవంతుడు కూడా అందులో పరివర్తన తీసుకునిరాలేడు. ప్లానింగ్ అంటే ప్లానింగ్! ఆ ప్లానింగ్‌లో అంతా ఉంటుంది. ప్రకృతి ప్లానింగ్ ఎలా ఉంటుందంటే, అందులో ప్రపంచంలోనివి అన్నీ ఉంటాయి. కానీ మన ప్రారబ్ధంలో లేకపోతే లభించదు. నీవైన వస్తువులన్నీ ఇక్కడే ఉన్నాయి.  ప్రకృతి ప్లానింగ్ చాల బాగా ఉంటుంది. అందులో ఎవరూ ఏమీ పెంచలేరు, దానికి బద్ధులై ఉండవలసిందే. కానీ అహంకరిస్తే కలిగేది దుఃఖమే ఔతుంది. అహంకారానికి బదులుగా కలిగేది దుఃఖమే. అయినా, ప్లానింగ్‌లో ఎటువంటి మార్పులూ జరగవు.

**ప్రశ్నకర్త:** ఈమధ్య భారతీయ ప్లేన్ (విమానం) పడిపోయింది, అందులోని 215 మంది చనిపోయారంటే, అందులో కూడా ప్లానింగ్ ఉండొచ్చా?

**దాదాశ్రీ:** ఔను, అంతా ప్లానింగే. ప్లానింగ్‌కి ఆవల ఏమీ జరగదు. ఎగ్జాక్ట్ ప్లానింగ్! అటువంటి యాక్సిడెంట్‌ని చూస్తే మనుషులకు ఆశ్చర్యమనిపిస్తుంది. ఇదేమిటి ఇలా అయింది అని. కానీ జంతువులకు ఆశ్చర్యం కలుగదు. ఎన్ని ఆవులు చూసాయో, ఎన్ని గాడిదలు చూసాయో కాని వాటికి ఆశ్చర్యం వెయ్యదు. అంతా నడుస్తుంటుంది. ఆవు, గాడిద ఇవన్నీ, ప్రకృతి ప్లానింగ్ ప్రకారమే జరుగుతుంటుంది, ఇందులో ఆలోచించేదేముంది అనుకుంటాయి.

## జ్యోతిష్య శాస్త్రంలోని సత్యం

**ప్రశ్నకర్త:** దయచేసి జ్యోతిష్యం అంటే అర్థమేమిటో చెప్తారా?

**దాదాశ్రీ:** ఈ ప్రపంచాన్ని నడిపేది భగవంతుడు కాదు. వేరే శక్తి నడిపిస్తుంటుంది. కనుక మన జ్యోతిష్య శాస్త్రం కరెక్ట్ (సత్యం). భగవాన్ దీన్ని నడిపిస్తుంటే, ఎవరైనా ఎక్కువ భక్తి చూపిస్తే జ్యోతిష శాస్త్రం తప్పని నిరూపితమయ్యేది. జ్యోతిష్యం సత్యమే. కాకపోతే దాన్ని తెలుసుకున్నవాళ్ళ కొరత ఉంది. వీళ్ళు పూర్తిగా తెలుసుకున్నవారు కారు. అందులోని భావాభావాలు వీళ్ళకి అర్థం కావు. స్పష్టంగా తెలుసుకోలేరు. కానీ జ్యోతిష్యమైతే సత్యమైనదే, అది విజ్ఞానమే.

సమస్త ప్రపంచంలో అందరూ 'లట్టూ' (బొంగరాలు). వాళ్ళు తమంతట తాముగా కర్మబంధం వేసుకోలేరు. స్వయంగా కర్మబంధం వేసుకుంటే అలా వేసుకోరు. దాని వెనుక నిమిత్తం అనేది ఉంది. ఈ ప్రపంచంలో మరుగుదొడ్డికి పోయే (స్వతంత్ర) శక్తి ఎవరికీ లేదు. అది ఆగిపోయినప్పుడు తెలుస్తుంది అది మన శక్తి కాదని. అప్పుడు డాక్టర్ అవసరం పడుతుంది.

**ప్రశ్నకర్త:** నడిపించే ఆ మరో శక్తి గ్రహబలమని నేను అనుకుంటాను.

**దాదాశ్రీ:** ఇదంతా పార్లమెంట్ శక్తి నడిపిస్తుంది. ఆత్మ సమక్షంలో ఈ పార్లమెంటు (మన లోపలి పార్లమెంటు) నడుస్తూవుంది. పార్లమెంట్‌లోకి అతని కేసు (దావా) వెళ్తుంది, 'ఈ మనిషి చేత ఈ నైమిత్తిక కర్మ జరిగింది' అని. అప్పుడు పార్లమెంట్‌లో అతని కేసు నడుస్తుంది. పార్లమెంటు తీసుకున్న నిర్ణయం ప్రకారం అతనికి ఫలితం లభిస్తుంది.

నిజానికి గ్రహశక్తి పనిచేస్తుంది అన్నది కూడా సరి కాదు. కానీ నడిపించే ఆ శక్తి ఆ మరో శక్తి. గ్రహశక్తి ఆ శక్తి ఆధీనంలో నడుస్తుంది. పార్లమెంటు నుంచి వచ్చిన నిర్ణయం ప్రకారమే ఇక్కడ కలెక్టర్ (జిల్లా అధికారి) పనిచేస్తాడు కదా అలాగే గ్రహాలన్నీ పనిచేస్తాయి. చూడండి, నా గ్రహాలన్నీ వెళ్ళిపోయాయి. కనుక నా దగ్గర గ్రహాల సర్వీసు (సేవ) అనేదే లేదు. కనుక నన్ను ఏ గ్రహమూ స్పృశించదు కానీ వాటి శక్తి నన్ను స్పృశిస్తుంది. నా మీద గ్రహం ప్రభావం ఉండదు. నా మీద ఆ మరో శక్తి అధికారం డైరెక్ట్ గా ఉంది. మధ్యలో ఈ గ్రహాల అధికారం ఏమీ లేదు. మీలో, మీ అందరిలో గ్రహాలుంటాయి. నాలో ఏ గ్రహమూ లేదు. నాకు దురాగ్రహం లేదు,

మతాగ్రహం లేదు, హఠాగ్రహం లేదు, కదాగ్రహం లేదు. నాకు నవ గ్రహాలలో ఏ గ్రహమూ లేదు. అన్ని గ్రహాలూ నాకు అనుకూలంగా ఉంటాయి. అవన్నీ నాకు మిత్ర గ్రహాలలాంటివే.

**ప్రశ్నకర్త:** ఈ గ్రహాలు, నక్షత్రాలు ఏమిటి?

**దాదాశ్రీ:** అదంతా దేవలోకం. దానిని జ్యోతిష్క దేవ అంటారు. దేవగతిలో జీవితమంతా క్రెడిట్ (సత్ఫలం) లభిస్తుంది. అక్కడ డెబిట్ (దుష్ఫలం) అనేది ఉండదు. అక్కడ ఇంద్రియ సుఖాలు ఎక్కువగా ఉంటాయి కాని, సనాతన సుఖం ఉండదు.

**ప్రశ్నకర్త:** నాకు నిజమైన సుఖం కావాలి.

**దాదాశ్రీ:** నిజమైన సుఖం సెల్ఫ్ రియలైజేషన్ (ఆత్మ సాక్షాత్కారం) వలన కలుగుతుంది, సనాతన సుఖం లభిస్తుంది.

## నువ్వేం చెయ్యగలవు?

మీరు ఉదయం లేచిన తర్వాత ఏమేం చేస్తారు?

**ప్రశ్నకర్త:** లేచిన తర్వాత స్నానపానాదులు, తర్వాత రోజువారీ వ్యవహారాలు చెయ్యవలసివుంటుంది కదా?

**దాదాశ్రీ:** అంటే, ఆ పనులన్నీ మీరే స్వయంగా చేస్తారా?

**ప్రశ్నకర్త:** ఔను. చెయ్యాలి కదా?

**దాదాశ్రీ:** కాదు, మీరు చేస్తారా లేక చెయ్యవలసివస్తుందా?

**ప్రశ్నకర్త:** నేనే చేస్తాను.

**దాదాశ్రీ:** కానీ, మీరు చేస్తారా లేకపోతే ఎవరైనా మీచేత చేయిస్తారా?

**ప్రశ్నకర్త:** ఎవరూ చేయించరు.

**దాదాశ్రీ:** అంటే, మీరే చేస్తారా? అయితే మరి ఎప్పుడైనా ఒంట్లో బాగోలేకపోతే మలవిసర్జన ఆగిపోతుంది. అప్పుడు మీరు చెయ్యగలరా?

**ప్రశ్నకర్త:** అది శరీరానికి సంబంధించింది, శరీరం మీద అంత కంట్రోల్ (నియంత్రణ) కలిగివుండటం చాల కష్టం.

**దాదాశ్రీ:** శరీరం మీద కంట్రోల్ లేదా? సరే పోనీ. ఎప్పుడైనా నిద్ర పట్టకపోతే మీరు ప్రయత్నిస్తే నిద్రపడుతుందా?

**ప్రశ్నకర్త:** సరైన ప్రయత్నం చేస్తే పడుతుంది.

**దాదాశ్రీ:** మలవిసర్జన చేయగల స్వతంత్ర శక్తి ఉన్నవాళ్ళు ఈ ప్రపంచంలో పుట్టనే లేదు. ప్రతివారూ భ్రాంతిలోపడి, నేను చేసాను, నేను చేసాను అంటూవుంటారు. అదంతా భ్రాంతే, నిజం కాదు. నిజం తెలుసుకోవాలి. అది ఎలా అర్థమౌతుంది? అది ఎవరి వ్యూపాయింట్‌తోనూ అర్థం కాదు.

'ఇది నేను, దీన్ని నేను చేసాను' అనేదంతా అహంకారమే. చేసేవారు వేరు. భగవాన్ కూడా చెయ్యలేరు, మీరూ చెయ్యలేరు. అది తెలుసుకోవాలనుకుంటే వాస్తవం ఏమిటో నేను చెప్తాను. లేదంటే మీకు ఏం తెలుసో అదే చెప్తాను– భగవాన్ చేస్తారు, మీరు కూడా చేస్తారని.

**ప్రశ్నకర్త:** లేదు. మేమేమీ చెయ్యలేము.

**దాదాశ్రీ:** అంటే మీ వ్యాపారం మీరు స్వయంగా చేయకున్నట్లయితే మరి ఎవరు చేస్తున్నారు?

**ప్రశ్నకర్త:** కానీ మేమయితే భగవాన్ చేతిలో కీలుబొమ్మలం. ఆయన ఎలా ఆడిస్తే అలా ఆడుతాం.

**దాదాశ్రీ:** కాదు కాదు. యు ఆర్ నాట్ టాయ్స్ ఆఫ్ గాడ్ (మీరు భగవాన్ ఆటబొమ్మలు కారు).

**ప్రశ్నకర్త:** మరేమిటి?

**దాదాశ్రీ:** యు యువర్‌సెల్ఫ్ ఈజ్ గాడ్! యు డోంట్ నో యువర్ ఎబిలిటీ, యువర్ నాలెడ్జ్! ఇది మీకు తెలియదు కనుకనే 'నేను భగవాన్ టాయ్ (బొమ్మ) ని అంటున్నారు.

సత్యమైన ఫిలాసఫీ (తత్త్వజ్ఞానం) తెలుసుకుంటే ఈ ఫిలాసఫీ చాల గూఢమైనది.

హిందువులూ 'నేను చేస్తున్నాను' అంటారు, ముస్లింలు 'నేను చేస్తున్నాను' అంటారు, జైనులూ 'నేను చేస్తున్నాను' అంటారు. అందరూ, 'నేను చేస్తున్నాను' అనే అంటారు. అది వాస్తవమైనది కాదు.

ఇది ఎక్కడా విననిది, పుస్తకాలలో చదవనిది అయిన కొత్త విషయం. ఇంతకు ముందు ఎన్నడూ జరగనిది జరిగింది. పది లక్షల సంవత్సరాలలో ఎన్నడూ జరగనిది ఈ విషయం. అందరూ ఇప్పటివరకు ఇదే అంటున్నారు, 'ఇది చెయ్యి, అది చెయ్యి' అని. కానీ 'చెయ్యటం' ఉన్న చోట మోక్షమనేది లేదు, ఎక్కడ మోక్షం ఉందో అక్కడ చెయ్యటానికి ఏమీ ఉండదు.

నువ్వేం చేస్తావు? రోజంతా ఏదో శ్రమపడుతుంటావా?

**ప్రశ్నకర్త:** శ్రమపడాలి కదా?

**దాదాశ్రీ:** ఏం శ్రమపడతావు. ఎవరూ ఎలాంటి శ్రమా పడనేపడరు. మరి ఏం చేస్తారు? కేవలం అహంకారంతో ఉంటారు, 'ఇది నేను చేసాను' అంటూ. శ్రమపడేది ఎద్దు. మనిషి ఎవరైనా శ్రమిస్తాడా? నువ్వు చూసావా?

**ప్రశ్నకర్త:** మరి ఈ ఆఫీసుకి పోయేవాళ్ళు, పనిచేసేవాళ్ళున్నారు అదేమిటి మరి?

**దాదాశ్రీ:** 'నేను చేస్తున్నాను అనేది రాంగ్ బిలీఫ్. ఇది ఆటోమేటిక్ (తనంతట తానుగా) జరిగిపోతుంటుంది. మలవిసర్జన మీరు చేస్తారా లేక అదే

జరిగిపోతుందా? 'నేను మలవిసర్జన చేసాను' అంటారు. నిద్ర మీరు పోతారా లేక నిద్ర అదే పట్టేస్తుందా?

**ప్రశ్నకర్త:** అదే పట్టేస్తుంది.

**దాదాశ్రీ:** మరి నిద్ర లేవటం మీరు చేస్తారా లేక ఎవరైనా లేపుతారా?

**ప్రశ్నకర్త:** దానంతటదే మెళకువ వస్తుంది.

**దాదాశ్రీ:** ఔను. ఇవి మీ చేతిలో లేవు. మరి మీ చేతిలో ఏముంది? మీరు కేవలం అహంకారంతో, 'నేను ఇది చేసాను, నేను అలా చేసాను' అంటారు. ఎప్పుడైనా, 'నాకు ఈ రోజెందుకో నిద్రే రాలేదు' అంటారు. ఈ రెండు విరుద్ధ భావాలు. 'నేను ఉదయం త్వరగా లేస్తాను' అంటారు, మరి గడియారం ఎందుకు పెట్టుకుంటారు? ఇంకా, 'నేను తిన్నాను' అంటారు. ఓహోహో, వచ్చారండి పెద్ద తినేవాళ్ళు! పళ్ళు దాన్ని నములుతున్నాయి, నాలిక రుచిని ఆస్వాదిస్తోంది, ఈ చెయ్యి పనిచేస్తుంది, ఇవన్నీ మెకానికల్‌గానే జరిగిపోతుంటాయి. నువ్వు చేసేది కేవలం అహంకారమే.

**ప్రశ్నకర్త:** అయితే మరి నేను చేసేదేమిటి?

**దాదాశ్రీ:** మీరు ఏమీ చెయ్యరు. మీరు పనిని చెడగొడతారు ఇంకా, (అహంకారంతో).

## అనంత శక్తిని కలిగివున్నవాడు, బంధంలో

ఇదంతా మెకానికల్ (యాంత్రికం) గా జరిగిపోతుంటుంది. పెళ్ళి కూడా చేసుకుంటాడు, అది కూడా మెకానికల్‌గానే జరిగిపోతుంది. పిల్లవాడు పుడతాడు, అదీ మెకానికలేగానే జరుగుతుంది. మీరు ఎవరు అన్న రియలైజేషన్ (సాక్షాత్కారం) జరిగినట్లయితే, ఇక మీరు మెకానికల్‌గా ఉండరు. మీరు స్వయంగా చేస్తున్నారో, లేక భగవాన్ చేయిస్తున్నాడో అన్నది అన్వేషించాలి కదా? మీరు స్వయంగా చేసేది, అన్నీ మీ ఇచ్ఛతో మీరుగా చేసేది సంభవమేనా? అలా 100% జరుగుతుందా?

**ప్రశ్నకర్త:** 100% జరగటంలేదు కదా?

**దాదాశ్రీ:** ఔను కదా, అయితే మీరు స్వయంగా కర్త కారు. కానీ మీకు, నేనే కర్తను అనిపిస్తుంది.

**ప్రశ్నకర్త:** భగవంతుడు చేయిస్తున్నాడు.

**దాదాశ్రీ:** లేదు. ఇది భగవంతుడు కూడా చేయించడు. ఒకవేళ భగవంతుడే చేయిస్తున్నట్లయితే, దొంగలు, 'మమ్మల్ని ప్రేరేపించింది భగవంతుడే' అంటారు. అరె బాబా, భగవాన్ అలాంటి ప్రేరణ కలిగించేవాడు కాడు. ఆయన ఇందులో చెయ్యే పెట్టడు.

## ప్రపంచ వ్యవహారాల మీద మన అధికారం ఎంత?

నీకు ఇష్టం లేకపోయినా నువ్వు కర్మబంధాన్ని తగిలించుకుంటావు. ఎందుకంటే మీరు, 'నేను కర్తని, ఇది నేను చేసాను, ఇది నేను చేసాను' అని భావిస్తుంటారు కనుక.

**ప్రశ్నకర్త:** అందరికంటే ముందు జన్మించినవాడికి అంతకు ముందు కర్మ అంటూ ఏమీ ఉండదు కదా?

**దాదాశ్రీ:** ఎవరూ ముందు పుట్టటం జరగలేదు. ఈ ప్రపంచంలో ముందు, వెనక అనేదేమీ లేదు. ఇది సర్కిల్ (గుండ్రం) గా ఉంది. ఇందులో ఏది మొదలు? ఇందులో ఏదీ ముందు కాదు, ఆది లేదు, అంతం లేదు. అంతా అనాది, అనంతమైనదే. ఎవరూ ముందు పుట్టలేదు. అది బుద్ధితో అనుకునే మాట. బుద్ధితో సాల్వ్ కూడా అవదు, జ్ఞానంతో సొల్యూషన్ దొరుకుతుంది. ఆరు తత్త్వాలు అవినాశనమైనవి. ఈ ఆరు తత్త్వాలలో నిరంతరం సమసరణం, అంటే పరివర్తన జరుగుతుంటుంది. దానితో అన్ని అవస్థలు ఎదురౌతాయి, ఆ అవస్థలన్నీ వినాశనమయ్యేవి.

సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్ అంటే ఏమిటి? సమయం, స్పేస్ (ప్రదేశం), కర్మఫలం, ఇవన్నీ జమకూడినపుడు ఉరి శిక్ష పడుతుంది. శిక్ష వేయటం జడ్జ్ (న్యాయాధిపతి) చేతుల్లో లేదు. స్వతంత్ర శక్తి కలిగినవాడు ఇంతవరకు పుట్టలేదు ఎందుకంటే అంతా పరాశక్తే. ప్రకృతి తన ఫేవర్ (పక్షంలో) ఉన్నపుడు మీరు, 'నేనే చేసాను, నేను కర్తను' అనుకుంటారు.

చెయ్యటమనేది వచ్చినపుడు అక్కడ భ్రాంతి పెరుగుతుంది. ఇక ఏమాత్రం చేసినా భ్రాంతి ఇంకా పెరిగిపోతుంటుంది. 'జ్ఞాని పురుష్' ఎదురైనపుడు చేసేది ఏమీ లేదు. ఏమైనా చేస్తే భ్రాంతి ఇంకా పెరుగుతుంది. జపం చేస్తే భ్రాంతి పెరుగుతుంది. తపం చేస్తే భ్రాంతి పెరుగుతుంది. పుస్తకాలు చదివితే భ్రాంతి పెరుగుతుంది. నేను ఇది చేసాను, నేను అది చేసాను, అనేదంతా భ్రాంతి. 'జ్ఞాని పురుష్' కృపతో, 'చేసేది' ఏమీ లేదు, అంతా సహజంగా జరిగిపోతుంటుంది.

ఏ మనిషీ భోజనం చెయ్యలేదు. కేవలం అహంకారమే, నేను భోజనం చేసాను అనుకుంటుంది. మరి రోగాలపాలెందుకు అవుతారు? రోగగ్రస్తులైనపుడు తినలేకపోతారెందుకు? అయితే అంతకు ముందు కూడా తినే ప్రయత్నం మీదేనా? అంతకు ముందు తినేవారు కదా, మరి ఇప్పుడు ఎందుకు తినరు? ఇలాంటి ఆలోచనే ఎప్పుడూ చెయ్యలేదా? ఇదంతా నేచర్ (ప్రకృతి) నడిపిస్తుంది కాని భగవాన్ నడిపించడు. రాత్రిపూట నిద్రపోయినప్పుడు కూడా ప్రపంచం నడుస్తూనే వుంటుంది. ప్రపంచం ఒక్క నిమిషం సేపు కూడా ఆగదు. ఏ వ్యక్తయినా మద్యం తాగి పడిపోతే, అప్పుడూ ప్రపంచం నడుస్తూనేవుంటుంది. మీరు ఎప్పుడైనా బ్రాందీ తాగారా?

**ప్రశ్నకర్త:** ఆ.

**దాదాశ్రీ:** ఆ టైములో కూడా ప్రపంచం నడుస్తూనేవుంది, ఆగిపోలేదు. మీరు మద్యం తాగి మస్తీలో ఉన్నారు కానీ ప్రపంచం మాత్రం నడుస్తూనే వుంది. అది ఆగదు.

ప్రపంచంలోని వ్యవహారాలు మీరు జన్మించటానికి ముందు కూడా జరుగుతూనేవున్నాయి, మీరు మరణించిన తర్వాత కూడా నడుస్తాయి. ప్రపంచ వ్యవహారాలు సాపేక్షం. మనుషులు ఏమంటారు? 'నేను లేకపోతే ఏమయ్యేది? ప్రపంచం అలా అయిపోతుంది' అంటారు.

ఆ బాదరేషన్ (జంఝాటమంతా) వదిలేయి. అదంతా అహంకారపూరిత బాదరేషన్. నేను ఇలా చేసాను, పిల్లలను పెద్దచేసాను, పిల్లలను చదివించాను, నేను ఇది చేసాను, నేను అది చేసాను, అదంతా అహంకారం. ఒక వ్యక్తి ఆవుని చంపటానికి చూసాడు, మరో వ్యక్తి ఆ ఆవుని రక్షించే ఆలోచన చేసాడు. అలాంటప్పుడు భగవంతుని దృష్టిలో ఎవరికి ఎక్కువ విలువ ఉంటుంది? భగవాన్ అనేదేమిటంటే, 'ఇక్కడ ఎవరికీ ఏ విలువా లేదు. నువ్వు చంపుతాననే అహంకారంతో ఉన్నావు, అతను రక్షిస్తానని అహంకారంతో ఉన్నాడు. నా దగ్గర అహంకారులకు స్థానం లేదు.' నేను ఇది త్యాగం చేసాను' అనే అహంకారం వద్దు. అనంత జన్మల నుంచి చేస్తున్నది అదే కదా? దాని వలన లాభమేముంది? రిలెటివ్ లాభం ఉంటుంది. మనుషులలోంచి దేవగతికి పోతారు. కానీ, రియల్ లాభం లభించదు. రియల్ లాభం ఎప్పుడంటే, ముక్తపురుషుడు తటస్తపడితే, మోక్ష ప్రదాత అయినవారు తటస్థపడి, మోక్షదానం చేస్తే పని జరుగుతుంది.

ఒకానొక బ్రాహ్మణునికి ఇద్దరు కొడుకులు. ఒకడికి మూడు సంవత్సరాలు, మరొకడికి ఒకటిన్నర సంవత్సరాల వయస్సు. ఆ బ్రాహ్మణుడు చనిపోయాడు, అతని భార్య కూడా చనిపోయింది. గ్రామంలోని ఇతర బ్రాహ్మణులు వాళ్ళని తీసుకోవటానికి సిద్ధంగా లేరు. గ్రామంలో ఉన్న ఒక క్షత్రియుడు సంతానం లేనందువలన, 'నాకు ఒక అబ్బాయినివ్వండి' అని అడిగాడు. గ్రామస్తులు అతనికి పెద్ద కొడుకుని ఇచ్చారు. రెండవ ఒకటిన్నర సంవత్సరాల వయసుగలవాడిని తీసుకోవటానికి ఎవరూ సిద్ధంగా లేరు. ఒక హరిజనుడు, 'నాకు అబ్బాయిలెవరూ లేరు, నాకు ఇస్తే మీకు ఋణపడివుంటాను' అన్నాడు. అప్పుడు గ్రామవాసులు, ఇతను పాపం మరణించాడు కదా, వీడిని హరిజనుల దగ్గరకు పంపితే మంచిది అనుకున్నారు. కనీసం జీవించి వుంటాడు కదా అని. అలా రెండవ వాడు హరిజనుడి కుటుంబంలోకి పోయాడు.

పిల్లలిద్దరూ పెద్దవాళ్ళవుతున్నారు. క్షత్రియుని దగ్గర పెరుగుతున్నవాడు 20 సంవత్సరాల వయసుకి వచ్చాడు, హరిజనుడి దగ్గర పెరుగుతున్నవాడు 18 సంవత్సరాలకు వచ్చాడు. హరిజనుడి దగ్గర పెరుగుతున్నవాడు ఏం చేస్తున్నాడు? మద్యం తయారుచేస్తున్నాడు, తాగుతున్నాడు, మద్యం అమ్ముతున్నాడు కూడా. క్షత్రియుల కుటుంబంలో పెరుగుతున్నవాడు, మద్యం సేవించటం తప్పు, అది మంచిది కాదు అని తెలుసుకున్నాడు. ఇద్దరూ బ్రాహ్మణ సోదరులే. కానీ, ఒకిడికి హరిజన సంయోగం లభించింది. రెండవవాడికి మంచి క్షత్రియ సంయోగం లభించింది. ఒకరెవరో భగవాన్ ని అడిగారు, వీరిద్దరిలో ఎవరు మంచివాడు అని.  అప్పుడు భగవాన్, 'మద్యం తాగనని అహంకారంతో ఉండేవాడు ఒకడు, మద్యం తాగుతాననే అహంకారంతో మరొకడు ఉన్నారు. మోక్ష మార్గంలో ఎవరూ సాధన చెయ్యటం లేదు. తమ బాధ్యత మీదనే అలా చేస్తున్నారు. తాగుతున్నాననే అహంకారంతో ఉన్నవాడు తన బాధ్యత మీదనే చేస్తున్నాడు, తాగననే అహంకారంతో ఉన్నవాడు తన బాధ్యత మీదనే ఆ పని చేస్తున్నాడు' అన్నారు. మోక్షం కోసం ఎవరూ పనికిరారు. తమతమ బాధ్యతల మీదనే ఆ పనులు చేస్తున్నారు. తాగుతున్నాను అనే అహంకారంతో ఉన్నవాడు దాన్ని తన బాధ్యత మీద చేస్తున్నాడు. తాగటం లేదు అనే అహంకారంతో ఉన్నవాడు తన బాధ్యత మీద చేస్తున్నాడు'.

సత్యానికి సమాధానం తప్పక ఉండాలి. అప్పుడే శంకకి తావుండదు.

ఇదంతా సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్ మాత్రమేనని నేనంటాను. భగవాన్‌కి ఏమీ చెయ్యవలసిన పనే లేదు. సంయోగాలన్నీ అలాగే కలుస్తుంటాయి, పని జరిగిపోతుంటుంది. సైంటిఫిక్ (వైజ్ఞానిక) విధానంలో జరుగుతుంటాయి కానీ, మనిషి మాత్రం, 'నేను ఇది చేసాను, నేను అది చేసాను' అని అంటూవుంటాడు కేవలం అహంకారంతో.

**ప్రశ్నకర్త:** అహంకారమనేది ఉండగూడదన్నది నిజమే కానీ, కొన్ని ప్రవృత్తులు అవసరమే కదా? చెయ్యకపోతే ఏదీ జరగదు కదా?

**దాదాశ్రీ:** ప్రవృత్తి అనేది మరో శక్తి మీచేత చేయిస్తుంది. అందులో మీరు అహంకారం చూపించవలసిన పని లేదు. ఆ శక్తే అన్నీ చేయిస్తుంది. మీరు 'ఏం జరుగుతోంది, రవీంద్ర ఏం చేస్తున్నాడు అని చూడాలంతే. పనులన్నిటినీ చేయాలి, 'నేనే చేసాను' అని డ్రామాటిక్‌గా అనాలి కానీ, బిలీఫ్ (నమ్మకం) లో 'నేనే చేసాను' అని ఉండగూడదు. 'ఇది నేను చేసాను' అనే బిలీఫ్ ఉంటే అది తప్పు. ఇది ఎలా ఉంటుందంటే, నాటకంలో భర్తృహరి పాత్రను ధరిస్తాడు కానీ లోపల అతనికి తెలుసు అతను 'లక్ష్మీచంద్' అని. అందువలన భర్తహరి నాటకంలో అతనికి రాగద్వేషాలేవీ ఉండవు. అలా తనను తాను గుర్తిస్తే రాగద్వేషాలనేవి ఉండవు. ఇదంతా నాటకమే కదా. తను పర్మనెంటు, తాను డ్రామా (అభినయం) చేస్తాడు. ఇక్కడ అతని కొడుకుగా వచ్చాడు, ఆ డ్రామా పూర్తవుతుంది, తర్వాత వేరే చోట నాటకం సాగిస్తాడు, ఆ తర్వాత మరోచోట డ్రామాలో పనిచేస్తాడు. ద వర్ల్డ్ ఈజ్ డ్రామా ఇట్‌సెల్ఫ్. అర్థమైందా? ఇప్పుడు మీరు రవీంద్రగా డ్రామాలో చేస్తున్నారు. ఈ డ్రామాలో మరణించాలి. దెబ్బలు తినాలి, రోదించాలి, అలా అన్నీ చేయాలి కానీ రాగద్వేషాలను ఉంచుకోగూడదు. అలా, ఇలా అంటూ అన్నీ మాట్లాడాలి కానీ అన్నీ సూపర్‌ఫ్లువస్ (చూపించేందుకే) రాని దాని వెనక ఏమీ ఉండగూడదు. అలా జీవించాలి. ఇది డ్రామా, దీని రిహార్సల్స్ (పూర్వాభ్యాసం) కూడా జరిగిపోయింది. మీకు ఇందులో కొత్తగా చేసేదేమీ లేదు.

## వాస్తవానికి జగత్ కర్త ఎవరు?

ఇది శాస్త్రానికి బయట ఉన్న విషయాలు. నేను రెండు రకాలుగా మాట్లాడవలసి ఉంటుంది. మీలాంటి ఆలోచనాపరులై, నన్ను, 'ఈ ప్రపంచాన్ని ఎవరు సృష్టించారు?' అని అడిగితే నేను,'గాడ్ ఈజ్ నాట్ ద క్రియేటర్ ఆఫ్ దిస్ వర్ల్డ్ అటాల్' (భగవాన్ ఈ ప్రపంచ రచయిత ఏమాత్రం కాదు) అని చెప్తాను. కానీ సాధారణ వ్యక్తి నన్ను అడిగితే, అది కూడా ఎక్కువమంది ఉన్న సభలో అడిగితే, 'గాడ్ ఈజ్ ద క్రియేటర్' (భగవాన్ రచయిత) అని చెప్తాను. ఎందుకంటే ఆ ఫాక్ట్ (సత్యం) అతనికి అర్థం కాదు. వాళ్ళకి ఏ భాషలో అర్థమౌతుందో, అదే భాషలో చెప్పాలి. వాళ్ళకి అర్థంకాని భాషలో మాట్లాడితే, వాళ్ళకున్న ఆధారం పోతుంది, ఆధారమనేది లేకపోతే మనిషి జీవించలేడు.

గాడ్ ఈజ్ ద క్రియేటర్ ఆఫ్ దిస్ వర్ల్డ్ (భగవాన్ ఈ ప్రపంచాన్ని రచించినవాడు) అనే మాట భ్రాంతి భాషలో సరైనదే, ఆ వ్యూపాయింట్ (దృష్టికోణం) లో సరైనదే.

వ్యూపాయింటతను వచ్చినపుడు అతని ప్రారబ్ధాన్ని నేను చూస్తాను, ఇతని ప్రారబ్ధంలో నా ఫ్యాక్ట్ (యదార్థం) అనేది లేదని. కనుక అతనికి వ్యూపాయింట్ దృష్ట్యామో అన్ని విధాల హెల్ప్ (సహాయం) చేస్తాను. అప్పుడతను ముందుకు వెళ్ళగలుగుతాడు.

భగవంతుడే ఈ ప్రపంచాన్ని సృష్టించాడన్న మాట రియల్ కాదు. అదంతా రిలెటివ్. రిలెటివ్ వైపు అనంతమైనన్నిసార్లు పోయాను కానీ నా పని సంతోషదాయకం ఎప్పుడూ అవలేదు. దానికోసం రియల్ వైపే వెళ్ళవలసివచ్చింది.

మీకు తెలిసినదానికి ముందు కూడా తెలుసుకోవాల్సింది ఉంది కదా? ప్రస్తుతం ప్రపంచంలో వ్యాపించివున్న జ్ఞానమే నిజమని మీరు నమ్మారు. కానీ అది లౌకిక జ్ఞానం. దాన్ని దాటి ఎంతో ముందుకి వెళ్ళాలి.

**ప్రశ్నకర్త:** ఇంత పెద్ద ప్రపంచం, ఇంత పెద్ద వ్యాపార వ్యవహారాన్ని భగవాన్ తప్ప మరెవరు సృష్టించగలుగుతారు?

**దాదాశ్రీ:** అతని దగ్గర వేరే పనేమీ లేకుండావుండేది కనుకనే సృష్టించాడు అనిపిస్తోంది కదా!

**ప్రశ్నకర్త:** ఎవరు చేసినా, బాగా ఆలోచించి చేసినట్లనిపిస్తోంది.

**దాదాశ్రీ:** ఏం, ఆయన కొడుక్కి పెళ్ళి చేయటానికి ఆయనకు అమ్మాయి దొరకక ఈ బ్రహ్మాండాన్ని తయారుచేసాడా?

**ప్రశ్నకర్త:** మరి దీని క్రియేటర్ ఎవరు?

**దాదాశ్రీ:** క్రియేటర్‌కి అర్థం కుమ్మరి అని. కుమ్మరి అంటే మట్టితో కుండలు తయారుచేసే ప్రజాపతి. భగవాన్ కుమ్మరి కాదు. భగవానైతే భగవానే. ఫారిన్‌వాళ్ళంతా విశ్వసించేది, గాడ్ ఈజ్ ద క్రియేటర్ ఆఫ్ దిస్ వర్ల్డ్ (భగవానే ఈ

ప్రపంచాన్ని తయారుచేసాడు) అని. ముస్లింలు, అల్లాహ్ ఈ ప్రపంచాన్ని తయారుచేసాడు అంటారు. హిందువులు భగవానే అంతా తయారుచేసాడు అంటారు. ఫారిన్ సైంటిస్ట్‌లను నేను కలిసినపుడు, గాడ్ ఈజ్ ద క్రియేటర్ ఆఫ్ దిస్ వర్ల్డ్ ఈజ్ కరెక్ట్ బై క్రిస్టియన్ వ్యూపాయింట్, బై హిందూ వ్యూపాయింట్, బై ముస్లిం వ్యూపాయింట్ బట్ నాట్ బై ఫ్యాక్ట్ అని అంటాను. బై ఫ్యాక్ట్ ఓన్లీ సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్. మీరు ఫ్యాక్ట్ తెలుసుకోవాలనుకుంటే, నా దగ్గరకు రండి. లేకపోతే మీరైతే సంతోషంగా ఉన్నారు కదా? మీకు ఏమనిపిస్తుంది?

**ప్రశ్నకర్త:** అన్ని ధర్మాల ధ్యేయం ఒకటే అయినప్పుడు, ఒపీనియన్స్ (ఆలోచనా సరళి) వేరువేరుగా ఎందుకున్నాయి? అందరూ, 'మేము చెప్పేదే సత్యం' అని ఎందుకు అంటారు?

**దాదాశ్రీ:** ఈ సర్కిల్‌లో ఇది సెంటర్, ఇది 360 డిగ్రీలలో ఉంది. అందులో ఒక మతం 60 డిగ్రీలలో ఉంది, మరో మతం 120 డిగ్రీలలో ఉంది, మరొకటి 180 డిగ్రీలలో ఉంది. అలా ప్రతి ఒక్కరి వ్యూపాయింట్ వేరువేరుగా ఉంది. 140 డిగ్రీలలో ఉన్నవాని వ్యూపాయింట్‌లో అతను చూసేది, 200 డిగ్రీలలో ఉన్నతని వ్యూపాయింట్‌కి భిన్నంగా ఉంటుంది. 140 డిగ్రీలతను, 200 డిగ్రీలతనితో, నువ్వనేది తప్పు అంటాడు. 200 డిగ్రీలతను 140 డిగ్రీలతను చెప్పేది తప్పు అంటాడు. నేను చెప్పేదేమిటంటే, 200 డిగ్రీలలో ఉన్నతను 140 డిగ్రీలకు వచ్చి, 140 డిగ్రీలలో ఉన్నతను 200 డిగ్రీలకు రావాలి. ఆ స్థానం నుంచి చూసి, అప్పుడు మాట్లాడాలి. అప్పుడు ఇద్దరూ, లేదులేదు ఈ మాట సత్యమే అని అంటారు. మీకు అర్థమైంది కదా? కానీ పూర్తి వ్యూపాయింట్ అంతా 360 డిగ్రీలలో ఉన్నతనిదే. కాబట్టి ఎవరిది ఏ వ్యూపాయింట్ అయితే, అతను ఆ వ్యూపాయింట్ నుంచే మాట్లాడుతాడు, నేను చెప్పేదే నిజమని. వ్యూపాయింట్ ఎప్పటికీ కంప్లీట్ (సంపూర్ణమైన) నిజం కాదు.

ఒకటి క్రిస్టియన్ వ్యూపాయింట్, ఒకటి ముస్లిం వ్యూపాయింట్, ఒకటి హిందూ వ్యూపాయింట్, ఒకటి జైన్ వ్యూపాయింట్. కానీ ఇవన్నీ వ్యూపాయింట్లే. అందరూ చెప్పదలచుకున్నది ఒకటే. సెంటర్‌ని తెలుసుకుందామనేది. అదే అందరి కోరిక. కానీ ఆ సెంటర్ పాయింట్‌ని తమ వ్యూపాయింట్‌లో చూస్తారు, అదే చెప్తారు.

మతాలన్నీ వేరువేరు డిగ్రీలలో ఉన్నాయి. అందుకే అందరి మధ్య జగడాలు వస్తుంటాయి. కానీ భగవాన్ దగ్గర జగడాలు ఏమీ లేవు. భగవాన్ దగ్గర ఏముంది? తెలుసుకోవలసింది ఒకటే, అందరి వ్యూపాయింట్స్ వేరువేరని. మనుషులంతా, ఈ ప్రపంచాన్ని భగవంతుడే సృష్టించాడు, గాడ్ ఈజ్ ద క్రియేటర్ ఆఫ్ దిస్ వర్ల్డ్ అంటారు. అది నీ వ్యూపాయింట్ ప్రకారం సత్యమే. కానీ ఫ్యాక్ట్ (వాస్తవికత) ప్రకారం, 100% తప్పు. ఫ్యాక్ట్ ఎప్పుడూ సైద్ధాంతికంగా ఉంటుంది, వ్యూపాయింట్‌లు భిన్నంగా ఉంటాయి. ఫ్యాక్ట్‌లో ఉన్నది కేవలం సైంటిఫిక్ సర్క్‌మ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్ మాత్రమే.

ఎవరి వ్యూపాయింట్‌నీ చెడగొట్టగూడదు. ఫ్యాక్ట్ అర్థం కానంతవరకు, వాళ్ళని వాళ్ళ వ్యూపాయింట్‌లోనే ఉండనివ్వాలి, అందుకు సాయం కూడా చేయాలి. నేను అలాగే చేస్తాను. వాళ్ళకున్న వ్యూపాయింట్‌లోనే వాళ్ళకి సహాయం చేస్తాను. దానివలన అతను ముందుకు వెళ్ళగలుగుతాడు. ఫ్యాక్ట్ తెలుసుకోగోరేవాళ్ళకి ఫ్యాక్ట్ ఏమిటో చెప్తాను. ఇది రియల్, పూర్తిగా సైంటిఫిక్, ఇది జగత్తంతటికీ వర్తిస్తుంది. మీకు ఏది కావాలో దాన్ని ఇక్కడి నుంచి తీసుకునిపోండి. నేను సెంటర్‌లో ఉన్నాను. నాకు ఎవరితోను అభిప్రాయ భేదం లేదు.

**ప్రశ్నకర్త:** ఉపనిషత్తులలో కూడా ఈశ్వరుడు కర్త కాదు అని చెప్పారు.

**దాదాశ్రీ:** ఈశ్వరుడే కర్త అయినట్లయితే ఆయనకీ కర్మబంధం ఏర్పడుతుంది.

**ప్రశ్నకర్త:** నా హృదయంలో కూడా ఈశ్వరుడు కర్త ఎలా అవుతాడు అనే ఈ ప్రశ్న చెలరేగుతుంటుంది. ఇప్పుడు మిమ్మల్ని కలిసిన తర్వాత అది నాకు స్పష్టంగా తెలిసింది.

**దాదాశ్రీ:** భగవాన్ వీతరాగి. పెద్ద పెద్ద మహాత్ములు నాతో మాట్లాడటానికి వస్తారు. వాళ్ళలోని, 'ఈశ్వరుడే కర్త' అనే బిలీఫ్ పోదు. వాళ్ళని నేను, 'భగవాన్ వీటన్నిటినీ సృష్టించినట్లయితే, భగవాన్‌ని ఎవరు సృష్టించారు?' అని అడుగుతాను. దానికి వారి దగ్గర జవాబు ఉండదు. ఇది లాజికల్ (తార్కికం). సృష్టించేవాడంటూ వుంటే, అతనికి జన్మనిచ్చినవాళ్ళు కూడా ఉండాలి కదా అన్నది లాజికల్ (తార్కికం).

భగవాన్ ఏమీ సృష్టించనప్పుడు అతని మీద ఆరోపిస్తావు? భగవాన్ అయితే భగవానే, వీతరాగి. ద వర్ల్డ్ ఈజ్ పజిల్ ఇట్‌సెల్ఫ్. గాడ్ హాజ్ నాట్ పజిల్డ్ ద వర్ల్డ్ ఎటాల్. ఒకవేళ భగవాన్ పజిల్‌గా చేసుంటే, ఈ సిబిఐ వాళ్ళని పైకి పంపించి, అతన్ని పట్టుకుని జైలుకి పంపించవలసివుంటుంది. అందరూ దుఖాన్ని అనుభవించ వలసినటువంటి ప్రపంచాన్ని ఎందుకు సృష్టించాడు? భగవాన్ ఈ పజిల్‌ని తయారు చేయలేదు.

గాడ్ ఈజ్ నాట్ ద క్రియేటర్ ఆఫ్ దిస్ వర్ల్డ్ ఎటాల్, ఓన్లీ సైంటిఫిక్ సర్క్‌మ్‌స్టాన్షియల్ ఎవిడిన్స్ (భగవాన్ ఈ ప్రపంచానికి కర్త కాడు, సైంటిఫిక్ సర్క్‌మ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్ మాత్రమే కర్త). ఇవన్నీ తయారుచేయవలసిన అవసరం భగవాన్‌కి ఎంతమాత్రం లేదు. ఈ జగత్తుని ఎవరూ తయారు చేయనేలేదు. ఎందుకంటే ఈ జగత్తు ఏదైతే ఉందో, దానికి బిగినింగ్ (ప్రారంభం) అంటూ వుంటే, దానికి ఎండ్ (అంతం) కూడా ఉండాలి. కానీ ఈ జగత్తుకి ప్రారంభమనేదే లేదు. అది అనాదికాలం నుంచే ఉంది, అనంతకాలంగా ఉంటుంది. అది ఎప్పుడూ క్రియేట్ (సృజన) అవలేదు, ఎప్పటికీ నాశనమయ్యేది కాదు. అలా అనాది అనంతమైనది.

**ప్రశ్నకర్త:** కాని, ఈ జగత్తు వినాశనమయ్యేది.

**దాదాశ్రీ:** లేదు. ఇది అనాది, అనంతమైనది. పర్మనెంట్ అయినది. సనాతనమైనదానికి ఆది ఉండదు, అంతమూ ఉండదు.

**ప్రశ్నకర్త:** మనుషుల కోసమైతే ఈ జగత్తు వినాశనమయ్యేదే కదా?

**దాదాశ్రీ:** అది నిజమే. అది రిలెటివ్. ఆల్ దీజ్ రిలెటివ్స్ ఆర్ టెంపరరీ అడ్జస్ట్‌మెంట్స్. కానీ జగత్తు, అనాది, అనంతమైనది.

మీకిది పర్మనెంట్ అనిపిస్తోందా?

**ప్రశ్నకర్త:** అలా చూస్తే అంతా టెంపరరీయే.

**దాదాశ్రీ:** ఔను టెంపరరీయే. మరి పర్మనెంట్ ఏమైనా ఉందా?

**ప్రశ్నకర్త:** పర్మనెంటైతే ప్రకృతే అవుతుంది.

**దాదాశ్రీ:** ప్రకృతా? ప్రకృతైతే నిరంతరం మారుతూనేవుంటుంది. ఒక అవస్థ నాశనమైతే మరో అవస్థ ఉత్పన్నమౌతుంది. అది పర్మనెంట్ ఎలా అవుతుంది? మరి పర్మనెంటు ఏదౌతుంది?

**ప్రశ్నకర్త:** ఆ ప్రాసెస్ (ప్రక్రియ) అయితే పర్మనెంటే కదా?

**దాదాశ్రీ:** అందులో అయితే ఒక అవస్థ నాశనమౌతుంది, మరో అవస్థ ఉత్పన్నమౌతుంది. అందులో పర్మనెంట్ అనేదేముంది?

**ప్రశ్నకర్త:** నాశనం చేసేది, ఉత్పన్నం చేసేది అది పర్మనెంటా?

**దాదాశ్రీ:** నాశనం చేసేదెవరు?

**ప్రశ్నకర్త:** అంతా ప్రకృతే.

**దాదాశ్రీ:** మీరు ప్రకృతికి డెఫినిషన్ (నిర్వచనం) సరిగ్గా ఇవ్వలేదు.

**ప్రశ్నకర్త:** అదే నాలెడ్జ్ (జ్ఞానం). ప్రకృతికి డెఫినిషన్ జ్ఞానం అయినప్పుడు, ఈ ప్రకృతి అంటే ఏమిటి అన్నది మనిషికి అర్థమౌతుంది.

**దాదాశ్రీ:** అన్నం తిని పడుకుంటావు కదా, మరి నీలోపల నడిపించేది ఎవరు? అందులో బైల్, జీర్ణమయ్యే రసాలను నీవు వేస్తున్నావా? ఇరవై నాలుగు గంటలలో భోజనం బ్లడ్ (రక్తం) అవుతుంది. దాన్ని ఎవరు చేస్తున్నారు? యూరిన్ (మూత్రం) ని ఎవరు తయారుచేస్తున్నారు? అవన్నీ తయారౌతున్నాయీ అంటే, వాటిని ఎవరు తయారుచేస్తున్నారు? వాటిని చేయటానికి భగవంతుడేమైనా వస్తాడా? అదెవరు చేస్తారు? దాన్ని ఎవరూ చేయవలసిన పనే లేదు. అలాగే జగత్తంతా నడుస్తోంది. ప్రకృతి ద్వారానే నడుస్తోంది.

**ప్రశ్నకర్త:** ఏమిటీ ప్రకృతి అంటే?

**దాదాశ్రీ:** ప్రకృతి అంటే, సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్. మీరు ఇక్కడికి ఎలా వచ్చారు? ఎన్నో సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్‌లు కలిస్తేనే ఒక పని జరుగుతుంది.

2H (హైడ్రోజెన్), ఒక O (ఆక్సిజెన్) సైంటిస్ట్‌కి ఇస్తే, వీటితో నేను నీరు తయారచేస్తానంటాడు. ఏమిటి మీరు నీటికి మేకర్ (తయారు చేసేవారా) అని అడిగితే, 'ఔను. మీరు నాకు 2H, ఒక O ఇస్తే నేను దానితో నీరు తయారుచేస్తాను' అంటాడు. అంతవరకు అతన్ని మేకర్ అనవచ్చు. మరి మీ దగ్గర 2H అయిపోయింది, వన్ O మాత్రమే ఉంది, దానితో నీరు తయారుచేయమని అడిగితే అతను ఏమంటాడు, 'దీనితో తయారవదు' అంటాడు. మరి నువ్వు తయారుచేసేవాడివా? 2H, ఒక O కలిస్తే నీరు అయిపోతుంది. పై నుంచి వర్షపు నీరు పడుతుంది కదా, అందులో ఏ దేవుడూ చేసేది ఏమీ ఉండదు. సంయోగాలు వాటంతటవే కలిసి నీరుగా కింద పడుతుంది. ఇందులో తయారు చేసే (మేకర్) అవసరం ఏమీ లేదు. అది సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్.

ఒక మనిషి ఇప్పుడు జీవించివున్నాడు. ఏదైనా ఒక మందు డోస్ (ఔషధ మోతాదు) ని అతనికి తాగిస్తే అతను మరణిస్తాడు. అంటే ఎవరు చంపినట్లు? భగవంతుడు చంపేసాడా? ఎవరైనా వ్యక్తి చంపినట్లా?

**ప్రశ్నకర్త:** పోస్ట్‌మార్టమ్ (డాక్టర్ చేసే శవ పరీక్ష) చేయాలి.

**దాదాశ్రీ:** ఔను. పోస్ట్‌మార్టమ్‌తో ఏం జరిగిందన్నది తెలుస్తుంది. ఏం తెలుస్తుందంటే, ఏ పదార్థం, ఏ మందు వలన చనిపోయాడు అన్నది. అతని చావుకి ఎటువంటి సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్ తయారై, దానితో చనిపోయాడు అన్నది. విషమే ఇతన్ని చంపేసేంత విషం ఇతనికి ఇవ్వటం జరిగింది. భగవాన్ కూడా చంపడు, విషం ఇచ్చినవాడు కూడా చంపడు. విషం ఇచ్చినవాడు విషమిచ్చాడు, వాంతి అయింది, విషం బయటకు వచ్చేసిందంటే చావడు. విషమిచ్చినవాడే చంపినవాడైతే, ఆ మనిషి తప్పక చనిపోయుండేవాడు. కానీ చంపింది విషమే. భగవాన్ ఇందులో చెయిపెట్టడు.

ఇది కేవలం విజ్ఞానమే. మీ బాడీ ఎలా తయారైంది అన్నది కూడా కేవలం విజ్ఞానమే. ఈ జగత్తు కూడా అలాగే విజ్ఞానంతో నడుస్తోంది. ఈ బాడీ కూడా అలాంటి విజ్ఞానంతోనే ఉత్పన్నమైంది. దానికోసం బ్రహ్మ అవసరం లేదు., విష్ణువు అవసరం లేదు, శివుడు అవసరం లేదు. ఈ బాడీని భగవంతుడు తయారుచేయడు. కానీ భగవాన్ హాజరీ అవసరం. భగవాన్ ఉంటే అవుతుంది, లేకపోతే అవదు.

**ప్రశ్నకర్త:** ఈ సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్‌ని కాస్త విస్తారంగా వివరించండి.

**దాదాశ్రీ:** సరే. మీరు నన్ను కలవటానికి ఎలా వచ్చారు? మీకు ఎంతవరకు కనిపిస్తుందో (అర్థమౌతుందో) అంతవరకు చెప్తారు, 'జ్ఞానిపురుష్ ఇక్కడకు వస్తున్నారు అని ఈ భాయ్ చెప్పాడు' అని. ఆ మాటతో మీరు 'పద, ఈరోజు వెళ్దాం' అనే ఆలోచన చేస్తారు. మీరు ఇక్కడికి వచ్చారు. నేను బయటకు పోవలసినవాడినే కానీ పోలేదు. మీకు దర్శనమైంది. దీని వెనక ఎన్ని కాజెస్ ఉన్నాయి? కనిపిస్తున్నంత వరకే కాదు కాజెస్, ఇంకా చాలా ఉన్నాయి. అందులో ఒక కాజ్ కలవకపోయినా పని జరగదు. ఏయే కాజెస్‌తో ఇది జరిగిందో మీకు తెలియదు. ఈ కాజెస్‌ని సైంటిఫిక్ అని ఎందుకు అన్నానంటే, ఇందులో ఎన్నో గుప్తమైన కాజెస్ ఉన్నాయి. మీకు కాస్త అర్థమైందా?

**ప్రశ్నకర్త:** ఆ.

**దాదాశ్రీ:** భగవంతుడు నా కొడుకుని తీసుకునిపోయి చాల నష్టం కలిగించాడు అంటారు. అదంతా తప్పు. అలా అనకూడదు. భగవాన్ అయితే భగవానే!! ఆయనెప్పుడూ తప్పు చేయలేదు.

మీరు మీ భార్యతో కలిసి ప్రశాంతంగా భోజనం చేస్తున్నారు, ఐదు నిమిషాల తర్వాత అభిప్రాయ భేదం వస్తుంది అంటే, ఆ అభిప్రాయభేదాన్ని ఎవరు కలిగించారు? 'మీ ఇష్టంతో జరిగిందా? మీ ఇష్టంతోనే అభిప్రాయభేదం కలిగిందా' అని మిమ్మల్ని

అడిగితే మీరు, 'లేదు' అంటారు. భార్యని అడిగితే ఆమె కూడా 'లేదు' అంటుంది. మరి ఆ అభిప్రాయభేదాన్ని కలిగించింది ఎవరు?

**ప్రశ్నకర్త:** రిలెటివ్ కేరెక్టర్ (వ్యవహారిక గుణం), మనసు, టెంపరమెంట్ (స్వభావం) వీటన్నిటిమీద ఆధారపడివుంటుంది.

**దాదాశ్రీ:** అవన్నీ విజిబుల్ కాజెస్ (కనిపించే కారణాలు). నిజమైన కారణం (కాజెస్) కావాలి. విజిబుల్ కాజెస్‌ని కంటితో చూడవచ్చు, చెవితో వినవచ్చు. అలాంటివి.

**ప్రశ్నకర్త:** సైంటిఫిక్ విధానంలో విజిబుల్ కాజెస్‌నే మనం చూడవలసి వుంటుంది కదా?

**దాదాశ్రీ:** వేరే దారే లేదు మీకు. మరి ఈ అభిప్రాయభేదాన్ని ఎవరు కలిగిస్తారు?

**ప్రశ్నకర్త:** కొందరు ఈ శక్తిని భగవాన్ అంటారు, కొందరు ప్రకృతి అంటారు, మరికొందరు అదృశ్య శక్తి అంటారు కానీ దాని పేరు ఎవరూ చెప్పరు.

**దాదాశ్రీ:** అది ఒకే శక్తి. దాని ఆధారంగానే అంతా నడుస్తుంది. వేరే ఏ మేనేజరూ లేదు. ఈ శక్తి కూడా కంప్యూటర్ లాంటిదే. అందులో చేతన లేదు. ఇందులో చేతనేగనక ఉంటే, భగవాన్ మీదనే ఆరోపిస్తారు ఆయనే నడిపిస్తున్నాడని. ఆ శక్తితోనే అంతా నడుస్తూవుంది. మీరు వాస్తవాన్ని తెలుసుకునే ఆలోచన చేసారా?

**ప్రశ్నకర్త:** ఔను వాస్తవమే కావాలి.

**దాదాశ్రీ:** బై ఫాక్ట్, గాడ్ ఈజ్ నాట్ ద క్రియేటర్ ఆఫ్ దిస్ వర్ల్డ్ ఎటాల్. ఓన్లీ సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్.

**ప్రశ్నకర్త:** హు జెనరేటెడ్ దీజ్ ఎవిడెన్సెస్ (ఈ సంయోగాలను ఎవరు తయారుచేసారు?

**దాదాశ్రీ:** అది ఒక శక్తి. అది అన్ని సంయోగాలను సమీకరిస్తుంది (ఎవిడెన్సెస్ జెనరేటెడ్).

**ప్రశ్నకర్త:** ఆ శక్తి ఏమిటియ

**దాదాశ్రీ:** నేను దానికి 'వ్యవస్థిత శక్తి' అని పేరుపెట్టాను. 'ఆ వ్యవస్థిత శక్తి' ఈ ప్రపంచాన్ని వ్యవస్థితంగా (వ్యవస్థ రూపంలో) నిర్వహిస్తుంది. సూర్య చంద్ర నక్షత్రాలు అన్నిటినీ వ్యవస్థితంగా ఉంచుతుంది. అనాది కాలం నుంచి నిర్వహణ కావిస్తున్నది వ్యవస్థితమే. జీవులన్నిటి జనన మరణాలు, మీ ప్రపంచాన్నంతటినీ ఆ శక్తే నిరంతరం నడిపిస్తుంటుంది. జీవులకు కావలసినదంతటినీ కేవలం 'వ్యవస్థిత శక్తి' నడిపిస్తుంది. ప్రతి రోజు పనిచేసేది ఆ శక్తే. సంయోగాలన్నిటినీ జమకూర్చేది ఈ శక్తే. దానికి మరో పనేమీ లేదు. పెద్ద కంప్యూటర్ ఉంటుందే, అలాంటిదే దీని పని.

**ప్రశ్నకర్త:** ఈ కంప్యూటర్ మాట అర్థం కాలేదు.

**దాదాశ్రీ:** నీవు మందిర నిర్మాణానికి పూనుకోవాలనుకున్నావే అనుకో. ఇక్కడ నీవు చేసిన ఆలోచన, ఆ పెద్ద కంప్యూటరైన 'వ్యవస్థిత శక్తి' నమోదు అవుతుంది. నీవు చేసిన ఆ ఆలోచన కాజ్ అవుతుంది, ఆ కాజ్ వ్యవస్థిత శక్తి లోకి పోతుంది. 'వ్యవస్థిత శక్తి' దాని ఎఫెక్ట్ (పరిణామ) రూపంలో సంబంధిత సంయోగాలన్నిటినీ జతకూర్చుతుంది. అప్పుడు మీకు దాని ఫలితం లభిస్తుంది. ఇక మీరు మందిర నిర్మాణం చేసేస్తారు. మీరు అహంకారంతో, 'ఇది నేను చేసాను' అనవచ్చు కానీ అదంతా వ్యవస్థిత శక్తి నడిపించిన పని.

అలా, పరిణామం ఏది వచ్చినా, అది 'వ్యవస్థిత శక్తి' చేసిన పని. ఇది నేను నా జ్ఞానంతో చూసి చెప్తున్న విషయం. 'వ్యవస్థిత శక్తి' ఎగ్జాక్ట్ (యదార్థం) గా ఉన్న మాట. ఇది నా లక్షలాది జన్మల పరిశోధన.

**ప్రశ్నకర్త:** వ్యవస్థిత శక్తిని భగవాన్ అనవచ్చా?

**దాదాశ్రీ:** లేదు. 'వ్యవస్థిత శక్తి' ని భగవాన్ అనటం వలన ప్రయోజనం ఏముంటుంది? ఈ టేప్ రికార్డర్‌ని భగవాన్ అనటం వలన ఏం ప్రయోజనం? భగవాన్‌నే భగవాన్ అనాలి, టేప్ రికార్డర్‌ని టేప్ రికార్డర్ అనాలి. భగవాన్ లేనిచోట భగవాన్‌ని ఆరోపించటం వలన లాభమేమిటి? కానీ, జగత్తంతా 'వ్యవస్థిత శక్తి' నే భగవాన్ అంటుంది.

'వ్యవస్థిత' ను భగవాన్ అంటే ఆ లెటర్‌ని (ఉత్తరాన్ని) 'వ్యవస్థిత' స్వీకరించదు. ఎందుకంటే, దానిమీద చిరునామా భగవాన్‌ది, వ్యవస్థితేమో భగవాన్ కాదు కనుక. అప్పుడు ఆ లెటర్ తిరిగి భగవాన్‌కి చేరుకుంటుంది. అలా మన అర్జీలన్నీ భగవాన్ దగ్గరకే పోతుంటాయి. దాని వలన లాభం చేకూరుతుంది. అలా ప్రార్థన చెయ్యటం వలన, పరోక్ష లాభం కలుగుతుంది. కానీ పూర్తి లాభమైతే భగవాన్‌ని గుర్తించటంలో ఉంటుంది. యదార్థంగా భగవాన్ ఎవరు అన్నది తెలుసుకోవాలి.

పరోక్ష భగవాన్ భజన చేసినా లాభం ఉంటుంది. ఏదో ఒకటి చేయాలి కదా. దాని వలన లైట్ (ప్రకాశం) ఉంటుంది. సద్బుద్ధి ఉంటుంది. లేకపోతే అవి కూడా వెళ్ళిపోతాయి.

**ప్రశ్నకర్త:** వ్యవస్థిత శక్తి మన మీద కృప చూపించాలంటే ఏం చెయ్యాలి?

**దాదాశ్రీ:** ప్రపంచంలో కృప చూపించేవారు మరెవ్వరూ లేరు. మీ లోపలే ఉన్న భగవాన్‌దే కృప అంతా. కృప చూపించేవారు మరెవరూ లేరు.

'వ్యవస్థిత' ఎగ్జాక్ట్ స్వరూపాన్ని సంక్షిప్తంగా చెప్తాను.

చూడండి, డ్రామా ఉంటుంది కదా, దాని రహోర్సల్స్ ముందుగానే జరుగుతాయి, తర్వాత డ్రామా జరుగుతుంది. ఆ సమయంలో ఆలోచించవలసిన అవసరమే లేదు. ఎందుకంటే రిహోర్సల్స్ ముందే జరిగాయి కనుక. అలాగే జరుగుతుంది. అది 'వ్యవస్తితమే'. దాని రిహోర్సల్స్ మీరు చూసారు, దాని డ్రామా ఇప్పుడు జరుగుతూవుందంటే, అది 'వ్యవస్థితం'. అందులో మార్పులు ఉండవు. రిహోర్సల్స్ ఎలా చేసారో అలాగే ఇప్పుడు జరుగుతుంది. పూర్వ జన్మలో జరిగిన

రిహార్సల్స్‌ని బట్టి ఈ జన్మలో దాని 'వ్యవస్థితం' జరిగిపోతుంది. ఇక అది 'వ్యవస్థితం' లోకి పోతుంది. పూర్వజన్మలో జరిగిన రిహార్సల్స్ అవస్థిత రూపంలో ఉంటుంది. ఆ అవస్థితం ఫలితాన్నివ్వటానికి తయారైనప్పుడు అది 'వ్యవస్థితం' అవుతుంది. కనుక జన్మ నుంచి మృత్యువు వరకు ఇందులో పరివర్తనలేమీ (మార్పులు) ఉండవు.

**ప్రశ్నకర్త:** ప్రకృతి లా (నియమం) ఏదైతే ఉందో, అదే 'వ్యవస్థిత' కి ఉన్న లా అవుతుందా లేక అదే వ్యవస్థితమా? రెండూ ఒకటేనా లేక వేరువేరా?

**దాదాశ్రీ:** ప్రకృతి చట్టాలు అన్నీ నియమంలో ఉన్నాయి. ఇక జీవులన్నిటిలో ఉన్న 'వ్యవస్థిత' లన్నీ 'వ్యవస్థిత' లో ఉన్నాయి. అది ఏమౌతుంది, ఏమవదు, ఆ వివరాలన్నీ దాని ఖాతాలోకి ముందే వచ్చేసి ఉన్నాయి. ప్రకృతి నియమం దానికి సహాయం చేస్తుంది. 'వ్యవస్థిత' అయితే పూర్వ జన్మ నుంచే జన్మ నుంచి మృత్యువు వరకు ఒక ఫిల్మ్ లా తయారైవుంది. ఈ గ్లాస్ (అద్దం) పగిలినట్లయితే, ఆ గ్లాసు ముందు నుంచే పగిలివుంది కానీ, ఇప్పుడు మనకి కనిపిస్తుంది. ఈ జగత్తు ఎలాంటిదంటే, ఇందులో ఒక పరమాణువైనా ఎప్పటికైనా పెరగదు, తగ్గదు. అవినాశీలో వస్తువులన్నీ అలాగే ఉండిపోతాయి. అన్నీ అయిపోయేవి వినాశిలో జరుగుతుంది. అవస్థలన్నీ వినాశీలు, వ వినాశీలలో అన్నీ చనిపోయి కనిపిస్తాయి. కానీ అవినాశీలో ఎవరూ చనిపోవటం అనేదే ఉండదు. ఇతను చనిపోయాడు, అలా పోయాడు, అలా జరిగింది అనేవన్నీ రాంగ్ బిలీఫ్. రైట్ బిలీఫ్‌లో అలా జరగదు.

**ప్రశ్నకర్త:** అన్నిటి నిర్మాణమూ జరిగిపోయింది, అంతా నిశ్చితమైందని మీరు అంటారు కదా అదేమిటి?

**దాదాశ్రీ:** నిర్మాణం జరిగింది (తయారైంది) అంతా సైంటిఫిక్ సర్కమ్ స్టాన్షియల్ ఎవిడెన్స్ (వ్యవస్థితం), నిర్మాణం జరగనిది సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్ కాదు. డిశ్చార్జ్ అయింది ఏదైతే ఉందో దాని నిర్మాణమైంది, అది సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్, ఇక్కడ మీరు సత్సంగంలోకి వచ్చారే అది డిశ్చార్జ్, వ్యాపారం చేసినపుడు డిశ్చార్జ్ (కర్మఫలం), నిద్రపోతుంటే అది కూడా డిశ్చార్జే. రోజంతా డిశ్చార్జే. నాతో మాట్లాడుతున్నారే అది కూడా డిశ్చార్జే. ఇక డిశ్చార్జ్ అంతా

నిర్మాణమౌతుంది. (కొత్తగా) అయిన ఛార్జ్ నిర్మాణం (ఇంకా) జరగలేదు. చార్జ్ మన చేతుల్లోనే ఉంది.

జగత్తు కేవలం నిర్మాణం మాత్రమే కాదు. చార్జ్ ఉంటుంది, డిశ్చార్జ్ కూడా ఉంటుంది. ఆ డిశ్చార్జ్ అంతా తిరిగి నిర్మాణమైంది. డిశ్చార్జ్ అయిన బ్యాటరీ నిర్మాణమైంది. ఎలా అయితే చార్జ్ అయిందో, అలాగే డిశ్చార్జ్ కూడా అవుతుంది.

అహంకారమే ప్రపంచం. అహంకారం, మమత్వం పోతే ఇక మోక్షం లభిస్తుంది. జన్మించిన దగ్గరి నుంచి మృత్యువు వరకు జరిగింది అంతా, ఏయే అవస్థలు జరిగాయో, చదువు, ఆటలు, రోగాలు, ఉద్యోగం, వివాహం, బ్రహ్మచర్యాశ్రమం, సన్యాసాశ్రమం, అదంతా డిశ్చార్జే. లోపల ఇక కొత్త చార్జ్ ఏమీ లేకపోతే, తిరిగి జన్మించటమనేది ఆగిపోతుంది. కానీ డిశ్చార్జ్ అయిందేదైతే ఉందో అది డిశ్చార్జ్‌గానే ఉండిపోతుంది. చార్జ్ చేసే అహంకారం, మమత్వం తొలగిపోతే, డిశార్జ్ బాగా జరుగుతుంది, మోక్షం ప్రాప్తిస్తుంది.

ఆచరణ డిశ్చార్జ్. చేసే ఆచరణ, ఆచారం అది డిశ్చార్జ్ అయిపోతుంది. చార్జ్ అవటం ఆగిపోయిన తర్వాత, డిశ్చార్జ్ అంతా నశించిపోతుంది. కాబట్టి ముందుగా చేయవలసింది ఏమిటి?

**ప్రశ్నకర్త:** చార్జింగ్‌ని నిలిపివేయాలి.

**దాదాశ్రీ:** మీకు కర్మబంధం పడుతుందా లేదా

**ప్రశ్నకర్త:** అదైతే అవుతుంది.

**దాదాశ్రీ:** చూడు నువ్వు 'ఇది నేను చేసాను' అని అన్నప్పుడు చార్జ్ అవుతుంది. నేను కూడా అంటాను ఇది నేను చేసాను అని. కానీ నేను నాటకీయంగా అంటాను, నువ్వేమో నిజంగా అంటావు.

**ప్రశ్నకర్త:** కానీ, 'నేను చేస్తున్నాను', 'నేను కర్తను' అని నాకు ఎప్పుడూ అనిపించలేదు.

**దాదాశ్రీ:** అయితే మీరెవరు?

**ప్రశ్నకర్త:** దాని అన్వేషణలోనే ఉన్నాను.

**దాదాశ్రీ:** అయితే నీవు కర్తవు. ఇప్పటి వరకు మీకు 'నేను చేసాను' అనే బాధ్యత మీద పడుతుంది. కానీ మీకు సెల్ఫ్ రియలైజేషన్ (ఆత్మ సాక్షాత్కారం) కలిగితే ఇక మీ బాధ్యత ఉండదు. మీరు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా, ఆత్మ సాక్షత్కారం జరిగేంత వరకు బాధ్యతంతా మీదే అవుతుంది.

కేవలం ఆత్మే తెలుసుకోవాలి. ఆత్మ జ్ఞానం లేకపోతే అప్పటి వరకు అంతా వింతగా ఉంటుంది. ఆత్మజ్ఞానం కలుగగానే ఆ విడ్డూరమంతా పోతుంది. అనిపించే ఈ భారమంతా ఆ విడ్డూరానిదే. సెల్ఫ్ రియలైజేషన్ అవగానే పజిల్ అంతా సాల్వ్ అయిపోతుంది. వెన్ దిస్ పజిల్ ఎండ్స్ దెన్ నో పజిల్ ఎండ్ దేర్ ఈజ్ ద సోల్ (ఈ పజిల్ సాల్వ్ అయిపోయిన తర్వాత మరో పజ్‌ల్ ఏమీ ఉండదు, అక్కడ ఉండేది ఆత్మే.)

**ప్రశ్నకర్త:** మీరు పజిల్ అంతం ఏమిటో చెప్పారు కదా, ఈ పజిల్‌కి ఆది ఎక్కడి నుంచి?

**దాదాశ్రీ:** దేర్ యీజ్ నో బిగినింగ్ అండ్ నో ఎండ్ ఆఫ్ దిస్ పజిల్. వేర్ దేరీజ్ అ బిగినిగింగ్, దేరీజ్ ఎన్ ఎండ్. (ప్రతి పజిల్‌కి ఆరంభం ఉండదు, అంతమూ ఉండదు. ప్రారంభం ఉంటేనే అంతం ఉంటుంది).

**ప్రశ్నకర్త:** మరి ఎవరు చేయిస్తున్నారు?

**దాదాశ్రీ:** అది శక్తి. ఒక పెద్ద కంప్యూటర్ లాంటిది. దాన్ని శాస్త్రీయ భాషలో సమిష్ఠి అంటారు, ఒక వ్యక్తి కంప్యూటర్ వ్యష్ఠి రూపంలో ఉంటుంది, జీవులందరి కంబైండ్ కంప్యూటర్ సమిష్ఠి రూపంలో ఉంటుంది. వ్యవహారమంతా అక్కడి నుంచే నడుస్తుంది. దీన్నే నేను సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్ 'వ్యవస్థిత శక్తి' అంటాను. అదే శక్తి రోజూ సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు అన్నిటి వ్యవస్థిత నిర్వహణ చేస్తుంది.

**ప్రశ్నకర్త:** నడిపించే ఆ శక్తి ఎక్కడి నుంచి వస్తుంది?

**దాదాశ్రీ:** అది ప్రకృతి శక్తే కాని భగవాన్ శక్తి కాదు. ఇది చాల పెద్ద విషయం. సులభంగా అర్థమయ్యేది కాదు. ఆటం (అణు) బాంబు తయారుచేసారు కదా, దాన్ని తయారుచేసింది అణువు లోనుంచే. మరి అణువులో ఎంత శక్తి ఉంది?

**ప్రశ్నకర్త:** చాల శక్తి ఉంది.

**దాదాశ్రీ:** అటువంటి శక్తి. అధిక శక్తిగలవాడే భగవాన్‌కి కష్టం కలిగించాడు. భగవాన్ శక్తి దానికంటే ఎక్కువ. అప్పుడు భగవాన్ తన శక్తితో విడుదలౌతాడు.

**ప్రశ్నకర్త:** భగవాన్ శక్తికి మించిన ఆ శక్తి ఏమిటి?

**దాదాశ్రీ:** ఎవరికి? పైన ఏ శక్తీ లేదు. భగవాన్‌కి ఉండే శక్తి చాల అధికం, అందరినీ మించినది. అనాత్మ (పుద్గల్) కి ఉన్న శక్తి కూడా ఎక్కువే.

**ప్రశ్నకర్త:** ఆ శక్తి భగవాన్‌కి కూడా మించిందా?

**దాదాశ్రీ:** లేదు. భగవాన్‌ని మించి ఎవరూ లేరు. కానీ ఆ (అనాత్మ) శక్తి చాల రాక్షస శక్తి. ఆ శక్తి వలన భగవాన్ స్వయంగా బంధింపబడ్డారు. ఇక భగవాన్ వదిలించుకోవాలనుకున్నా వదిలించుకోలేకపోయారు. ఇక దానికి మార్గం ఏం చెప్పారంటే, ముక్తపురుషుల సహాయంతో ముక్తులవవచ్చని.

**ప్రశ్నకర్త:** కానీ ఎవరైతే ముక్తులయ్యారో వాళ్ళని ఎవరు ముక్తులను చేసారు?

**దాదాశ్రీ:** సమయం చేసిందా పని. ఆ సమయం వచ్చింది కనుక ముక్తులయ్యారు. జీవులన్నిటికీ సమయం వచ్చినపుడు ముక్తి కలుగుతుంది. ఈ ప్రపంచం ఒక జైలు (కారాగారం). భగవాన్ ప్రపంచమనే జైలులో ఉన్నారు. సమయం తీరిపోగానే విముక్తులౌతారు. కానీ సమయం పూర్తవక ముందుగానే వాళ్ళకి (ప్రాపంచిక వినాశనకారకమైన బంధాల నుంచి విముక్తి పొందిన) ముక్త పురుషుని దర్శనం

అవుతుంది, అక్కడి నుండి విముక్తులౌతారు. ఇందులో ముక్తపురుషుడు నిమిత్తుడు. ఆ నిమిత్తుని ద్వారా వాళ్ళు విముక్తులౌతారు.

## మరి జగత్తుకి కర్త అనేవారున్నారా లేరా?

ఈ ప్రపంచానికి కర్త అనేవారు ఎవరూ లేనేలేరు, కర్త లేకుండా ప్రపంచం అవనేలేదు.

ఈ జగత్తుని ఎవరు సృష్టించారు?

**ప్రశ్నకర్త:** మాకు తెలియదు. దాన్ని తెలుసుకునే ప్రయత్నమే చేస్తున్నాం.

**దాదాశ్రీ:** ఔను. అందరూ తెలుసుకునే ప్రయత్నం చేస్తారు. కానీ, ఎవరూ తెలుసుకోలేదు. ద వర్ల్డ్ ఈజ్ పజిల్ ఇట్‌సెల్ఫ్. భగవాన్ ఈ పజిల్‌ని తయారు చేయలేదు. భగవాన్ పరమానంద, పరమ జ్యోతి స్వరూపంలో ఉంటారు.

**ప్రశ్నకర్త:** అంటే స్వయంగానే తయారుచేసుకున్న పజిలా?

**దాదాశ్రీ:** మీరు స్వయంగా పజిలేం చేసుకుంటారు? ఈ ప్రపంచానికి క్రియేటర్ ఎవరూ లేరు. ఈ ప్రపంచానికి కర్త అనేవారెవరూ లేరు. భగవాన్ కూడా కర్త కారు, మీరు కూడా కర్త కారు, కర్త లేకుండా ఈ ప్రపంచమే తయారవలేదు. నేను పరస్పర విరుద్ధమైన మాట చెప్తున్నా కదా? కానీ ఇది అర్థం చేసుకోవలసిన విషయం. 'కర్త లేడు' అంటే స్వతంత్ర కర్త లేడు. 'కర్త ఉన్నాడు' అంటే అతను నైమిత్తిక కర్త.

స్వయంగా కర్త అయినట్లయితే మోక్షానికి పోలేరు. ముక్తి చెందలేరు. నైమిత్తిక కర్త కాబట్టే ముక్తి చెందుతారు. స్వతంత్ర కర్త అయినట్లయితే అతను ప్రపంచానికి యజమాని అవుతాడు 'నేను ఈ ప్రపంచాన్ని తయారు చేసాను కనుక నేనే దీనికి యజమానిని' అంటూ. అయితే స్వయంగా మలవిసర్జన చేసే శక్తి కూడా లేనప్పుడు, యజమాని ఎక్కడినుంచి అవుతారు? యజమాని ఎవరూ లేరు. నైమిత్తిక కర్త అని ఎవరిని అంటారు? ఈ డాక్టర్ తోపుడు మీకు తగిలింది, మీ తోపుడు ఈ భాయ్‌కి తగిలింది, అతను కింద పడ్డాడు. ఆయన కాలు విరిగింది. అప్పుడు ఈ భాయ్

మిమ్మల్ని, 'నీవే నా కాలు విరగొట్టావు' అంటాడు. కానీ మీకు తెలుసు ఈ డాక్టర్ తో మీకు తోపులాటయిందని. అందులో మీ ఇష్టం ఏమీ లేదు, మీ బాధ్యతా లేదు. అలాంటిదే నైమిత్తిక కర్త అంటే. కర్తే కాని నైమిత్తిక కర్త. ద వర్ల్డ్ ఈజ్ పజిల్ ఇట్‌సెల్ఫ్. గాడ్ హాజ్ నాట్ పజిల్డ్ దిస్ వర్ల్డ్ ఎటాల్. ఓన్లీ సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్.

మీరు ఎప్పుడైనా సముద్రపు ఒడ్డుని చూసారా? సముద్రపు ఒడ్డు నుంచి కాస్త దూరంలోనే మీ బంగళా ఉందనుకోండి. బంగళా కాంపౌండ్ (ఆవరణ) లో మీరు రెండు ఇనుప ఊచలు పెట్టారు. పన్నెండు నెలల తర్వాత వెళ్ళినట్లయితే ఆ ఇనపు ఊచలకు ఏమైనా జరుగుతుందా? ఆ రస్టీ (తుప్పు పట్టటం) ఎవరి పని? సముద్రం చేసిందా? ఉప్పు కలిసిన గాలి చేసిందా? ఇనపు ఊచ కోరికా అది? 'నా కోరిక లేదు అందులో. నేనలా చేయలేదు' అంటుంది ఉప్పు గాలి. సముద్రాన్ని అడిగితే, అది తన క్షేత్ర పరిధిలోనే ఉంది. ఇనము తప్పా అది? ఆ ఇనుమును వేరే చోట పెడితే ఏం కాదు. ఏమంటారు దీన్ని? కేవలం సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్ మాత్రమే. ఇందులో భగవంతుడేమీ చెయ్యడు. భగవాన్ ఏం చేస్తారు? భగవాన్ మీకు ప్రకాశాన్నిస్తారు. దొంగకీ ప్రకాశానిస్తారు, పోలీసుకీ ప్రకాశాన్నిస్తారు. భగవాన్ ఏమంటారంటే, 'నువ్వు ఏం చేసినా నీ బాధ్యత మీదనే చేస్తావు. నేను ప్రకాశాన్నిస్తానంతే' అని.

**ప్రశ్నకర్త:** ఈ సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్ ఎలా తయారైంది? దాన్ని ఎవరు తయారుచేసారు?

**దాదాశ్రీ:** తయారుచేసినవారెవరూ లేరు. అది దానంతటదే అవుతుంది. అది కంప్యూటర్‌లా పనిచేస్తుంది. పూర్వజన్మ కర్మ అందులో ఫీడ్ అవుతుంది. ఇక లభించిన ఫలాన్ని, వ్యవస్థిత శక్తి అనబడే కంప్యూటర్ వంటి శక్తి ఇస్తుంది. దీన్ని శాస్త్రకారులు 'సమిష్ఠి' అన్నారు. ఇంగ్లీషులో దాన్ని సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్ అంటారు.

**-జై సచ్చిదానంద**

# నవకలమ్

(తొమ్మిది ప్రగాఢ అంతరంగ భావనలు)

(ప్రతిరోజూ మూడుసార్లు చదవండి)

1. ఓ దాదా భగవాన్! దేహధారియైన ఏ జీవాత్మ యొక్క అహంకారము కించిత్ మాత్రము కూడా గాయపడటకు నేను కర్తను, కారాయితను, ప్రేరకుడను, అనుమోదకుడను కాకుండునట్లు నాకు పరమశక్తిని ప్రసాదించండి.

   ఏ దేహధారి జీవాత్మ యొక్క అహంకారమును ఏ మాత్రము గాయపరచకుండు నట్టి సాత్విక వాణి, వార్తన, విచారము కలిగి ఉండునట్లు నాకు పరమశక్తిని ప్రసాదించండి.

2. ఓ దాదా భగవాన్! ఎవరి ధర్మ ప్రమాణములు కించిత్ మాత్రము కూడా కించపడుటకు నేను కర్తను, కారాయితను, ప్రేరకుడను, అనుమోదకుడను కాకుండునట్లు నాకు పరమశక్తిని ప్రసాదించండి.

   ఎవరి ధర్మము యొక్క ప్రమాణమును అణుమాత్రమైన కించపరచ కుండుటకు తగిన, అందరికీ ఆమోద్యమైన సాత్విక వాణి, వార్తన, విచారము కలిగి ఉండునట్లు నాకు పరమశక్తిని ప్రసాదించండి.

3. ఓ దాదా భగవాన్! ఏ దేహధారి ఉపదేశక సాధు, సాధ్వీ, ఆచార్యుల పట్ల అవర్ణవాదం,అపరాధం, అవినయం చేయకుండ ఉండే పరమ శక్తిని ప్రసాదించండి.

4. ఓ దాదా భగవాన్! ఏ దేహధారి జీవాత్మ పట్ల ఏమాత్రమైనా అభావం, తిరస్కారం, నానుండి ఎప్పుడూ జరగకుండా, జరిగించకుండా, కర్తగా ఆమోదించకుండా ఉండగల పరమ శక్తిని ప్రసాదించండి.

5. ఓ దాదా భగవాన్! నేను ఏ దేహధారి జీవాత్మ పట్ల ఎప్పుడూ కఠోరమైన పదజాలంతో, జగడాలమారి పదజాలంతో మాట్లాడకుండా, మాట్లాడించకుండా, లేదా మాట్లాడటానికి ఆమోదించకుండా ఉండగల పరమ శక్తిని ప్రసాదించండి.

ఎవరైనా కఠోరంగా, తగవులాడే భాషలో మాట్లాడితే నేను మృదు సరళ భాషలో మాట్లాడేందుకు పరమ శక్తిని ప్రసాదించండి.

6. ఓ దాదా భగవాన్! నేను ఏ దేహధారి జీవాత్మ పట్ల, స్త్రీ పురుష నపుంసకులు ఏ లింగానికి చెందినవారైనా, వారిపట్ల ఏమాత్రమైనా విషయవికార సంబంధ దోషాలు, కోరికలు, చేష్టలు, లేక ఆలోచనల దోషాలు ఉండకుండా, అలా చేయించకుండా లేదా కర్తగా ఆమోదించకుండా ఉండే పరమ శక్తిని ప్రసాదించండి.

   నేను నిరంతరం నిర్వికారిగా ఉండగల పరమ శక్తిని ప్రసాదించండి.

7. ఓ దాదా భగవాన్! నేను ఏ విధమైన ప్రత్యేక రుచికీ అలవాటుపడకుండా ఉండే శక్తిని ప్రసాదించండి.

   సమరస ఆహారాన్ని తీసుకునే పరమ శక్తిని ప్రసాదించండి.

8. ఓ దాదా భగవాన్! ఏ దేహధారి జీవాత్మ యొక్క ప్రత్యక్ష లేదా పరోక్ష, జీవించివున్నా లేదా మరణించినా, ఎవరిపట్లనైనా ఏమాత్రమైనా అవర్ణవాదం, అపరాధం, అవినయానికి పాల్పడకుండా, అలా చేయించకుండా, లేక కర్తగా ఆమోదించకుండా ఉండగల పరమ శక్తిని ప్రసాదించండి.

9. ఓ దాదా భగవాన్! జగత్ కళ్యాణ కార్యములో సాధనముగా మారుటకు నాకు పరమ శక్తిని ప్రసాదించండి, శక్తిని ప్రసాదించండి, శక్తిని ప్రసాదించండి.

   (పై విధంగా దాదా భగవాన్ని అడుగుతూ ఉండండి. ఇది ప్రతిరోజూ యాంత్రికంగా చదవాల్సిన విషయం కాదు, హృదయంలో ఉంచుకోవలసిన విషయం. ఇది ప్రతిరోజూ ఉపయోగ పూర్వకముగా అనుభూతి చెందాల్సిన విషయం. ఈ నవరత్నాలలో సమస్త శాస్త్రాల సారము ఇమిడి ఉన్నది)

# తెలుగులో దాదా భగవాన్ పుస్తకాలు

| | |
|---|---|
| 1. | అన్ని చోట్లా సర్దుబాటు |
| 2. | విభేదాలను తొలగించడానికి |
| 3. | ఎలాగైనా జస్టిస్ జరిగింది |
| 4. | బాధితుడు తప్పిదము |
| 5. | క్రోధం |
| 6. | చింత |
| 7. | నేను ఎవరు? |
| 8. | భావనతో మెరుగుపడతాయి జన్మ-జన్మలు |
| 9. | మృత్యు సమయం దానికి ముందు, దాని తర్వాత... |
| 10. | ఆత్మ సాక్షాత్కారం |
| 11. | మానవ ధర్మం |
| 12. | సేవ, పరోపకారం |
| 13. | ప్రతిక్రమణ |
| 14. | భార్యాభర్తల దివ్య వ్యవహారం |
| 15. | అంతఃకరణ స్వరూపం |
| 16. | పాప-పుణ్యం |
| 17. | తల్లి-తండ్రి, పిల్లల వ్యవహారం |
| 18. | దాదా భగవాన్? |
| 19. | కర్మ విజ్ఞానం |
| 20. | జగత్తుకి కర్త ఎవరు? |


❖ తెలుగులో మరిన్ని పుస్తకాలు జోడించబడుతున్నాయి మరియు త్వరలో అందుబాటులోకి వస్తాయి.

❖ దాదా భగవాన్ పుస్తకాలు వివిధ భాషలలో అందుబాటులో ఉన్నాయి. గుజరాతీ, హిందీ, ఇంగ్లీష్, మరాఠీ, తెలుగు, కన్నడ, ఒరియా, మలయాళం, బెంగాలీ, పంజాబీ, అస్సామీ, తమిళం, జర్మన్, స్పానిష్, రష్యన్, మొదలైనవి.

❖ 'దాదావాణి' పత్రిక ప్రతి నెలా మూడు భాషలలో ప్రచురితమవుతుంది : గుజరాతీ, హిందీ & ఇంగ్లీష్.

❖ అన్ని దాదా భగవాన్ పుస్తకాలు మరియు మ్యాగజైన్‌లు ఆన్‌లైన్ పుస్తక దుకాణంలో కూడా అందుబాటులో ఉన్నాయి : https://store.dadabhagwan.org

## దాదా భగవాన్ ఫౌండేషన్ తెలుగు యూట్యూబ్ ఛానల్




❖ ఇది అడాలజ్ దాదా భగవాన్ ఫౌండేషన్ యొక్క అధికారిక తెలుగు యూట్యూబ్ ఛానెల్.

❖ దిగువ లింక్ నుండి తెలుగు భాషలో సత్సంగ వీడియోలను చూడండి.

**'Dada Bhagwan Foundation Telugu' Channel:**

https://dbf.adalaj.org/yttelugu

*Open Link OR*

*Scan QR*

YouTube

---

*Dada Bhagwan Foundation Youtube video channels are available in other regional languages: Gujarati, Hindi, Marathi, Bengali, Tamil, Telugu, Kannada, Malayalam, Spanish, Portuguese, etc.*

## Persons to Contact

### Dada Bhagwan Foundation

**Adalaj** : **Trimandir**, Simandhar City, Ahmedabad-Kalol Highway
P/O: Adalaj, Dist. Gandhinagar - 382421, Gujarat, India.
Tel: +91-9328661166 / 9328661177
E-mail : info@dadabhagwan.org

**Mumbai** : **Trimandir**, Rushivan, Kajupada, Borivali (E)
Tel: +91-9323528901

| | | | |
|---|---|---|---|
| **Kolkata:** | 9830093230 | **Delhi:** | 9810098564 |
| **Jaipur:** | 9351408285 | **Chennai:** | 7200740000 |
| **Bhopal:** | 9425024405 | **Patna:** | 7352723132 |
| **Indore:** | 9039936173 | **Amravati:** | 9422915064 |
| **Raipur:** | 9329644433 | **Bangalore:** | 9590979099 |
| **Chandigarh:** | 9780732237 | **Hyderabad:** | 9885058771 |
| **Kanpur:** | 9452525981 | **Pune:** | 9422660497 |
| **Bhubaneswar:** | 8763073111 | **Jalandhar**: | 9814063043 |
| **Varanasi:** | 9795228541 | **Sangli:** | 9423870798 |

| | |
|---|---|
| **USA: Dada Bhagwan Vignan Institute**<br>Tel: + 1-877-505-DADA (3232)<br>Email: info@us.dadabhagwan.org | **U.K: Dada Darshan (UK)**<br>Tel: +44 330-111-DADA (3232)<br>Email: info@uk.dadabhagwan.org |
| **Germany** : +49 700 32327474<br>**UAE** : +97 1557316937<br>**Kenya** : +25 4722722063<br>**Dubai** : +971 501364530 | **Australia** : +61 421127947<br>**Singapore** : +65 81129229<br>**New Zealand** : +64 210376434 |

Website : www.dadabhagwan.org



## జగత్తుకు కర్త ఎవరు?

ఈ ప్రపంచానికి సృష్టికర్త లేదు. ఈ ప్రపంచానికి కర్త లేదు. దేవుడు లేదా మీరు కాదు. మరియు కర్త లేకుండా ఈ ప్రపంచం ఉండేది కాదు. మనం దీనిని వైరుధ్యం అని పిలుస్తున్నాము. సరియైనదా? కానీ ఇది అర్థం చేసుకోదగిన విషయం. కర్త లేదు. అంటే స్వతంత్ర కర్త లేదు మరియు కర్త నామమాత్రపు కర్త.

**-దాదాశ్రీ**

dadabhagwan.org

9 788198 166791

Printed in India

Price ₹ 50